


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు





సంపుటి : 1 సంచిక : 202 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : తాడేపల్లిగూడెం మంగళవారం 2 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 202 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM TUE 2 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ...

### తీవ్రంగా స్పందించిన జనసేన పార్టీ

- తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాడు జనసేన సభకు అనుమతి నిరాకరణ
- పార్కింగ్ సమస్యను కూడా ఓ కారణంగా చూపి కార్యక్రమానికి బ్రేకులు
- ప్రభుత్వ నిర్ణయం అర్థరహితమంటూ జనసేన పార్టీ తీవ్ర ఆగ్రహం
- నిత్యం కార్యక్రమాలు జరిగే చోట తమకే ఎందుకు అడ్డంకులని ప్రశ్న
- కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అనుమతి ఇవ్వలేదని పార్టీ ఆరోపణ



పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో పవన్ కల్యాణ్ తలపెట్టిన 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ'కు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై

- మిగతా 2లో

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం



- మతపరమైన విభజనపై బీజేపీ నిలబడి ఉందన్న కూనంనేని
- తెలంగాణలో జైత్రయాత్ర చేయబోతున్నామని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా
- ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలని సీపీఐ శ్రేణులకు పిలుపు

పెన్ పవర్ డెస్క్:సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు బీజేపీపై ధ్వజమెత్తారు. ఆ పార్టీ మతపరమైన విభజన, మతం అనే సౌధంపై నిలబడి ఉందని తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీజేపీ దండయాత్ర, జైత్రయాత్ర చేయబోతోందంటూ ఆ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, అయితే ఇక్కడ వారు కొన్ని సీట్లు గెలవొచ్చేమో కానీ అధికారంలోకి రావడం మాత్రం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు.

- మిగతా 2లో



## పవన్ కల్యాణ్ తెలంగాణలో సభ పెట్టుకోవచ్చు

పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటై పన్నెండేళ్లు పూర్తయిన తర్వాత కూడా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య బీఆర్ఎస్ పార్టీ కావాలనే

- మిగతా 2లో

## వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే

- స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందన్న జనార్దన్ రెడ్డి
- కూటమి కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- వైసీపీ నేతలకు కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు లేదని వ్యాఖ్య

- మిగతా 2లో



## తమిళనాడులో పోరు ఇక డీఎంకే, టీవీకే మధ్యే

- తమిళనాడులో రాజకీయ పోరు ఇక డీఎంకే, టీవీకే మధ్య మాత్రమేనని స్పష్టీకరణ
- తనది ప్రజలందరి ప్రభుత్వమని, రాష్ట్ర హక్కుల విషయంలో రాజీపడబోనని హామీ
- హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండిస్తూ, ప్రత్యర్థులపై విమర్శలు
- తాను ముఖ్యమంత్రిని కాదని, ప్రజలకు మొదటి సేవకుడినని వ్యాఖ్య
- తన వస్త్రధారణపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టిన విజయ్

- మిగతా 2లో





## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు...

- కాకినాడ జిల్లాలో కల్లుగీత కార్మికుడి ఇంటికి వెళ్లిన సీఎం చంద్రబాబు
- పోలరపు సింహాచలం అనే కార్మికుడికి స్వయంగా పింఛను అందజేత
- కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించాలని అధికారులకు ఆదేశం
- గీత కార్మికుల కష్టాలు తెలుసుకుని తాటికల్లు రుచిచూసిన సీఎం

పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు 'పేదల సేవలో' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవుతున్నారు. సోమవారం కాకినాడ జిల్లా, తుని నియోజకవర్గంలోని చామవరం గ్రామంలో పర్యటించిన ఆయన, కల్లుగీత కార్మికుడు పోలరపు సింహాచలం ఇంటికి స్వయంగా వెళ్లారు. ఆయనకు రావాల్సిన పింఛనును చేతికి అందించి ఆశ్చర్యపరిచారు. ఈ సందర్భంగా సింహాచలం కుటుంబ సభ్యులతో మాట్లాడిన సీఎం, వారి జీవన విధానం గురించి ఆరా తీశారు. అత్యంత శ్రమతో కూడిన కల్లుగీత వృత్తిలోని కష్టనష్టాలు, ఆదాయం వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో, తమకు సొంత ఇల్లు లేదని సింహాచలం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. ఆ కుటుంబానికి పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. అనంతరం, తాటి చెట్టు నుంచి

- మిగతా 2లో

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

## తుని సభలో చంద్రబాబు ఫైర్

- తుని నియోజకవర్గంలో పేదల సేవలో సభ
- వైసీపీని ఏకిపారేసిన సీఎం చంద్రబాబు
- సుపరిపాలన చూసి ఓర్వలేకపోతున్నారని విమర్శలు
- నంద్యాలలో వైఎస్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తేనని ఆరోపణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.65,887 కోట్లకు పైగా పెన్షన్లు పంపిణీ చేశామని వెల్లడి



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో సుపరిపాలనా యజ్ఞం చేస్తుంటే, ఓటమిని జీర్ణించుకోలేని వైసీపీ నేతలు రాక్షసుల్లా ఆటంకాలు సృష్టిస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అధికారం కోల్పోయిన కడుపు మంటతోనే రాష్ట్రంలో విద్వేషాలు రగిల్చేందుకు అడుగడుగునా కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలోని చామవరంలో సోమవారం జరిగిన 'పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా' పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసీపీ నేతలను ఏకిపారేశారు.

**సుపరిపాలన చూసి ఓర్వలేకే కుతంత్రాలు**

గత ఐదేళ్ల పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించేందుకు రాత్రింబవళ్లు శ్రమిస్తుంటే, వైసీపీ ఇంకా విధ్వంసాన్ని కొనసాగించే ప్రయత్నంలోనే ఉందని చంద్రబాబు విమర్శించారు. "సుపరిపాలన చూసి ఓర్వలేక గొడ్డలి పార్టీ కుట్రలు చేస్తోంది. వివేకానంద రెడ్డిని గొడ్డలితో నరికి చంపి గుండెపోటు

- మిగతా 2లో

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

- టీజీపీఎస్సీలో ఇకపై అన్ని పరీక్షలు కంప్యూటర్ ఆధారితంగానే
- ఓఎంఆర్ కంటే కంప్యూటర్ విధానమే అత్యంత సురక్షితం అన్న చైర్మన్
- పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రం తయారు చేయవచ్చని వెల్లడి
- పారదర్శకత కోసం ప్రతి 2-3 నెలలకు మీడియా సమావేశం ఏర్పాటు
- అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వడం సాధ్యం కాదని వ్యాఖ్య

- మిగతా 2లో



## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

- ముంబైలో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్‌తో నారా లోకేష్ భేటీ
- ఏపీలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధిపై చర్చలు
- ఎయిర్‌ట్రంక్ సీఈఓతో సమావేశమై వైజాగ్‌కు ఆహ్వానం
- విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుకు సానుకూలంగా స్పందించిన ఎయిర్‌ట్రంక్
- ఏపీకి ఐటీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పర్యటన

- మిగతా 2లో

## పవన్ ను ఎంత అణచివేస్తే అంత పైకిలేస్తాడు




- పవన్ సభకు హైదరాబాదులో అనుమతి నిరాకరణ
- కష్టపడి, వైఫల్యాల నుంచి పైకి వచ్చిన వ్యక్తి పవన్ అని నాగబాబు వ్యాఖ్య
- పవన్‌ను అణచివేయాలని చూస్తే అది ఆయనకే విజయంగా మారుతుందంటూ ట్వీట్
- పవన్ సాధించే విజయం సాధారణమైనది కాదని, చరిత్రగా నిలిచిపోతుందని ధీమా
- ప్రస్తుతం జరుగుతున్నది కూడా అదేనన్న నాగబాబు

- మిగతా 2లో

## ఏపీలో సహా వివిధ రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల

- దేశవ్యాప్తంగా 27 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభం
- ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ద్వైవార్షిక ఎన్నికలు
- బీహార్, కర్ణాటకలో శాసనమండలి స్థానాలకు కూడా ఎన్నికలు
- జూన్ 18న పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు
- కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా నోటిఫికేషన్ జారీ

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# లగ్జరీ సీఎం డీకే..!!

## చంద్రబాబు రికార్డ్లు బ్రేక్, మూడో ప్లేసులో దళపతి

-కర్ణాటక నూతన ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు స్వీకరించడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. జూన్ 3న డీకే కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సమయంలో డీకే లగ్జరీ లైఫ్ స్టైల్ పై సోషల్ మీడియాతోపాటు, పొలిటికల్ సర్కిల్స్‌లో హాట్ డిబేట్ నడుస్తోంది. రాజకీయాల్లో తనదైన వ్యూహాలతో 'ట్రబుల్ షూటర్'గా పేరొందిన డీకే స్టైల్ మెయింటెన్ చేయడంలోనూ కింగే అనిపించుకుంటున్నారు. ఆయన వాడే బ్రాండ్స్, వాటి ధరలు చూస్తే సామాన్యులకే కాదు, సెలబ్రిటీలకు సైతం మైండ్ బ్లాక్ అవుతోందని అంటున్నారు. ౘాశ్రీంశీ =ఘుం - జనసేన సభకు అనుమతి నో ! మెడలోని స్కార్ఫ్ ధర రూ. లక్ష! కాబోయే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఏ పబ్లిక్ మీటింగ్‌కు వచ్చినా, ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడినా ఆయన మెడలో ఒక స్కార్ఫ్ ప్రత్యేకంగా ఆకర్షిస్తుంది. అయితే అది ఏదో సాదాసీదా స్కార్ఫ్ అనుకుంటే పొరపాటే. అంతర్జాతీయ లగ్జరీ బ్రాండ్ అయిన 'లూయిస్ విట్టన్' కశ్మీర్ కలెక్షన్‌కు చెందిన ఆ స్కార్ఫ్ ధర అక్షరాల రూ. 1 లక్ష పైమాటేనని అంటున్నారు. ఇక ఆయన లైఫ్‌స్టైల్‌లో స్కార్ఫ్ మాత్రమే కాదు.. చేతికి పెట్టుకునే వాచీలు కూడా నెక్స్ట్ లెవెల్ అంటున్నారు. డీకే శివకుమార్ కలెక్షన్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన లగ్జరీ వాచీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆయన ధరిస్తున్న 'కార్టియర్ శాంటోస్' వాచ్ ధర సుమారు రూ. 50 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. అదేవిధంగా ప్రత్యేక సందర్భాల్లో ఆయన పెట్టుకునే 'రోలెక్స్ కాస్మోగ్రాఫ్' వాచ్ ధర దాదాపు రూ. 1 కోటి వరకూ ఉంటుందని సమాచారం.

డీకే' మోనోగ్రామ్ షర్టులు డీకే శివకుమార్ ధరించే వైట్ కుర్తాలు, షర్టులు కూడా సాదాసీదావి కావు అని చెబుతున్నారు. ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి కుట్టించుకునే ఈ దుస్తుల కఫ్‌లు లేదా ఛాతీ భాగంపై 'ఎన్' అనే అక్షరాలు చిన్నగా ఎంబ్రాయిడరీ చేసి ఉంటాయని అంటున్నారు. ఈ పర్సనల్ మోనోగ్రామ్ స్టైల్ ఆయన బ్రాండ్‌ను మరింత ఎలివేట్ చేస్తోందని చెబుతున్నారు. ఇక కేవలం లూయిస్ విట్టన్ మాత్రమే కాదు.. గూచీ, ఫెర్రాగామో, బర్‌బెర్రీ, ఫెండీ వంటి ప్రపంచ ప్రసిద్ధ బ్రాండ్ల క్యాష్మీర్ స్కార్ఫ్‌లను కూడా ఆయన వాడుతుంటారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, అత్యంత స్టైలిష్ పొలిటీషియన్‌గా పేరొందిన ఎస్.ఎమ్. కృష్ణ లగ్జరీ స్టైల్ చూసే డీకే కూడా ఈ బ్రాండెడ్ లైఫ్‌స్టైల్‌కు ఇన్స్పైర్ అయ్యారని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.

దేశంలోనే అత్యంత ధనిక సీఎం! అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ూణ=) గణాంకాల ప్రకారం.. డీకే శివకుమార్‌కు రూ. 1,400 కోట్లకు పైగా ఆస్తులు ఉన్నాయి. ఈ భారీ ఆస్తులతో ఆయన దేశంలోనే అత్యంత ధనిక ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించబోతున్నారు. డీకే శివకుమార్ తన ఆస్తులతో అత్యంత ధనిక సీఎంగా తొలి స్థానం ఆక్రమిస్తుండగా, ఇప్పటివరకు ధనిక ముఖ్యమంత్రిగా ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు రెండో స్థానానికి దిగిపోతున్నారు. ఇప్పటివరకు రూ. 931 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక సీఎంగా చంద్రబాబు ఉండేవారు. ఇక రాజకీయాల్లోకి వచ్చిన తొలి ప్రయత్నంలోనే సీఎం పీఠాన్ని దక్కించుకున్న కోలీవుడ్ స్టార్ విజయ్.. రూ. 648 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో నిలిచారు.

## తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం అసాధ్యం

- మొదటి పేజి తరువాయి

దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, అందువల్ల సీపీఐ శ్రేణులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.రాబోయే ఎన్నికల వ్యూహాన్ని ప్రకటిస్తూ, పొత్తులు ఉంటే కనీసం 5 స్థానాల్లో, లేనిపక్షంలో కనీసం 15 నియోజకవర్గాల్లో పోటీ చేసేలా పార్టీ సన్నద్ధం కావాలని కూనంనేని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో బలమైన 40 నియోజకవర్గాలను గుర్తించామని, అక్కడ ఆగస్టు 6 నుంచి 15 వరకు ప్రత్యేక పాదయాత్రలు చేపడతామని వెల్లడించారు. ఈ యాత్రల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలతో పాటు స్థానిక సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామన్నారు. అలాగే ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై జరుగుతున్న వేధింపులకు వ్యతిరేకంగా జూన్ 4న, ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై జూన్ 15న ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని, సెప్టెంబర్ 28న 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు.

## ఏపీలో సహా వివిధ రాష్ట్రాల్లో రాజ్యసభ ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఖాళీ అవుతున్న 27 రాజ్యసభ స్థానాలు, మూడు రాష్ట్రాల్లోని శాసనమండలి స్థానాల భర్తీకి ఎన్నికల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఈ మేరకు అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో సోమవారం ఉదయం 11 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది.

ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, నామినేషన్లు దాఖలు చేయడానికి జూన్ 8 చివరి తేదీ. జూన్ 9న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు ఉంటుంది. జూన్ 18న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు.

ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాల్లో మొత్తం 24 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. వీటితో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల్లో ఒక్కో రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నారు.

ఇక శాసనమండలి ఎన్నికల విషయానికొస్తే, బీహార్‌లో 9, కర్ణాటకలో 7 స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలు జరగనున్నాయి. అలాగే బీహార్‌లో నితీశ్ కుమార్ రాజీనామాతో ఖాళీ అయిన ఒక ఎమ్మెల్సీ స్థానానికి కూడా ఉప ఎన్నిక జరగనుంది.

# కడుపు మంటతోనే రాష్ట్రంలో వైసీపీ కుట్రలు

- మొదటి పేజి తరువాయి

డ్రామా ఆడారు. ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి కోడికత్తి, గులకరాయి నాటకాలతో ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు అధికారం కోల్పోయాక కూడా వారి బుద్ధి మారలేదు" అని మండిపడ్డారు.ఇటీవల జరిగిన పలు ఘటనలను ప్రస్తావిస్తూ వైసీపీ కుట్రలను ఆయన ఎండగట్టారు. "పరామర్శకు వెళుతూ సొంత కార్యకర్త సింగయ్యను కారు కింద తొక్కి చంపి పొదల్లో పడేశారు. ఇటీవల కడపకు చెందిన ఓ పాస్టర్‌ను పంపి మాపై హత్యాయత్నం డ్రామా ఆడారు. అంతకుముందు పాస్టర్ ప్రవీణ్ మద్యం తాగి ప్రమాదంలో చనిపోతే, దాన్ని కూడా మాకు అంటగట్టాలని చూశారు. సీసీకెమెరాలతో ఈ కుట్రలు బట్టబయలత్తాయ్యాయి. సాక్షాత్తు తిరుమల కొండపై సాక్షి మీడియా ప్రతినిధులే మద్యం బాటిళ్లు పడేసి అపవిత్రం చేసేందుకు ప్రయత్నించారు. కడపలో పెద్ద దస్తగిరిని ఆస్తుల వివాదంలో వైసీపీ వారే హత్య చేసి, టీడీపీపై నెపం మోపజూశారు. చివరికి నంద్యాలలో రాజశేఖర రెడ్డి విగ్రహాన్ని ధ్వంసం చేసింది కూడా వైసీపీ కార్యకర్తే. అందుకే ఆ వార్తను సాక్షి పత్రికలో రాయలేదు. కాకినాడలో దళిత డ్రైవర్‌ను చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీకి వైసీపీ సన్మానాలు చేసింది. ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్న వారి ఆటలు సాగనీయం" అని చంద్రబాబు హెచ్చరించారు.

### విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి

జూన్ 4వ తేదీ రాష్ట్ర చరిత్రలో విధ్వంసం నుంచి ప్రజలకు విముక్తి కలిగిన రోజుగా నిలిచిపోతుందని ముఖ్యమంత్రి అన్నారు. "గత పాలనలో ప్రజలు బహిరంగంగా నవ్వాలన్నా భయపడే పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం పోయింది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి పేదల కోసం పనిచేస్తున్నాం. రూ.10 లక్షల కోట్ల అప్పులున్నా, పెన్షన్లను రూ.1,000 పెంచి రూ.4,000 చేశాం. దివ్యాంగులకు రూ.6,000, ఆరోగ్య పెన్షన్లను రూ.10,000, రూ.15,000కు పెంచాం. 2024 జూలై నుంచి ఇప్పటివరకు రూ.65,887 కోట్లు ఎన్టీఆర్ భరోసా కింద అందించాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వడం లేదు," అని చంద్రబాబు వివరించారు. బటన్ నొక్కితే పైశాచిక ఆనందం తప్ప, ప్రజల కష్టాలు తెలియవని, అందుకే ప్రతీ నెలా ఒకటో తేదీన నేరుగా ప్రజల వద్దకే వచ్చి పెన్షన్లు అందిస్తున్నామని తెలిపారు.

### సంక్షేమంతో పాటు ఉపాధి, అభివృద్ధి

సంక్షేమంతో పాటు అభివృద్ధి, సుపరిపాలన అందిస్తూనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులతో 23 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం. కాకినాడ సమీపంలో రూ.80 వేల కోట్లతో గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ, అనకాపల్లి వద్ద ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ సిటీ, విశాఖలో గూగుల్ డేటా సెంటర్ వస్తున్నాయి. పీఎం సేతు కింద ఏటా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తాం. కేంద్ర సహకారంతో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుద్ధరించాం. ఎన్నో ఏళ్ల కల అయిన విశాఖ రైల్వే జోన్ కూడా సాకారమైంది" అని ముఖ్యమంత్రి ప్రకటించారు. పోలవరం ఎడమ కాలువను జూలైలోగా పూర్తి చేసి విశాఖకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.

### ఆదర్శ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. "పాఠశాలల్లో సంస్కరణలు తెచ్చి నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖరీదైన వైద్యం కోసం అప్పులపాలు కాకుండా 'యూనివర్సల్ హెల్త్ పాలసీ' తెస్తున్నాం. 'సంజీవని' పేరుతో ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేసి, ప్రివెంటివ్, ప్రిడిక్టివ్, క్యూరేటివ్ విధానంలో రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం," అని తెలిపారు. 2047 స్వర్ణాంధ్ర విజన్ ద్వారా రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలబెడతామని, శ్రీకాకుళం, అమరావతి, తిరుపతి కేంద్రంగా మూడు రీజియన్లను సమానంగా అభివృద్ధి చేస్తామని పునరుద్ఘాటించారు.

### దివ్యాంగుడిని ఆప్యాయంగా పలకరించిన చంద్రబాబు

సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి, పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకే 'పీ4' (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్స్ పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్గదర్శులుగా నిలుస్తున్న 'బంగారు కుటుంబాల'తో ఆయన మాట్లాడారు. అనంతరం, వేదిక వద్దకు వచ్చిన ఓ దివ్యాంగ అభిమానిని ఆప్యాయంగా పలకరించి, అతని భుజంపై చేయి వేసి ఫొటో దిగారు. అతనికి ప్రభుత్వ సహకారం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, ఎమ్మెల్యే యనమల దివ్య, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## పవన్ ను ఎంత అణచివేస్తే అంత పైకిలేస్తాడు

జనసేన పార్టీ ఎమ్మెల్సీ, మెగా బ్రదర్ కొణిదెల నాగబాబు తన తమ్ముడు, జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఆసక్తికరమైన, భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. పవన్ కల్యాణ్ రాజకీయ ప్రయాణాన్ని ఉద్దేశించి ఆయన చేసిన పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా నాగబాబు తన అభిప్రాయాన్ని పంచుకుంటూ, "అదృష్టం అందరినీ వరించదు. కొందరు నిరంతరం శ్రమించి, వైఫల్యాలను చవిచూసి, వాటి నుంచే మళ్లీ పైకి లేచి విజయాన్ని సాధిస్తారు. అలాంటి విజయం సాధారణమైనది కాదు... అది ఒక చరిత్ర అవుతుంది. పవన్ కల్యాణ్ కథ అదే" అని పేర్కొన్నారు.

"అధికార పక్షం లేదా ప్రత్యర్థులు ఆయన్ను అణచివేయాలని ప్రయత్నించినప్పుడు, అది ఆయనకు అతిపెద్ద విజయంగా మారుతుంది. ప్రస్తుతం జరుగుతున్నది కూడా ఇదే" అని నాగబాబు వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల ద్వారా, రాజకీయంగా ఎదురవుతున్న ఒత్తిళ్లను, సవాళ్లను పవన్ కల్యాణ్ తన విజయానికి సోపానాలుగా మార్చుకుంటారనే విశ్వాసాన్ని నాగబాబు వ్యక్తం చేశారు. తమ్ముడి రాజకీయ ప్రస్థానంపై ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు జనసేన శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.రేపు (జూన్ 2) పవన్ సభకు హైదరాబాదులో అనుమతి నిరాకరణ ఎదురైన నేపథ్యంలో నాగబాబు తాజా పోస్టు ప్రాధాన్యత సంతరించుకుంది.

## పవన్ కల్యాణ్ తెలంగాణలో సభ పెట్టుకోవచ్చు

- మొదటి పేజి తరువాయి

వైషమ్యాలు రెచ్చగొడుతోందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యెన్నెం శ్రీనివాస్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలంగాణలో సభలు నిర్వహించుకోవడానికి ఎలాంటి అభ్యంతరం లేదని, ప్రజాస్వామ్యంలో ఎక్కడైనా సభలు పెట్టుకునే హక్కు అందరికీ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అయితే సభల పేరుతో తెలంగాణను కించపరిచేలా మాట్లాడితే మాత్రం తాము చూస్తూ ఊరుకునేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

నిన్న మొన్నటి వరకు వైసీపీ అధినేత జగన్ తో కలిసి కేసీఆర్ చెట్టాపట్టాలు వేసుకుని తిరిగిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. నాడు ఏపీ ఎన్నికల్లో జగన్ వ్యతిరేకులను ఓడించడానికి కేసీఆర్ అన్ని విధాలుగా తెరవెనుక సహాయం చేశారని, అలాంటి వ్యక్తులు ఇప్పుడు తెలంగాణ ఆత్మగౌరవం అంటూ నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎండగట్టారు.

రాబోయే ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో అధికారంలోకి వచ్చేది ముమ్మాటికీ తమ కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల కంటే తమ ప్రభుత్వమే ప్రజా సంక్షేమంలో ముందుంటుందని జోస్యం చెప్పారు.

పవన్ కల్యాణ్ హైదరాబాద్ సభను వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ నేతలకు ఆయన కొన్ని సూటి ప్రశ్నలు సంధించారు. గతంలో ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేయలేదా అని ప్రశ్నించిన యెన్నెం.. స్వయంగా కేసీఆర్ తన కుమారుడికి ఎన్టీఆర్ పై ఉన్న అభిమానంతోనే కేటీఆర్ అని పేరు పెట్టుకున్న విషయాన్ని గుర్తుచేశారు. అలాంటి నేపథ్యం ఉన్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కేవలం రాజకీయ పబ్బం గడుపుకోవడం కోసమే ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టేలా దిగజారుడు రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు.

# తమిళనాడులో పోరు ఇక డీఎంకే, టీవీకే మధ్యే

తమిళనాడులో రాజకీయ పోరు ఇకపై టీవీకే, డీఎంకే మధ్య మాత్రమేనని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, టీవీకే అధినేత విజయ్ అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించిన తర్వాత సోమవారం తొలిసారిగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో కుటుంబ రాజకీయాలకు ప్రజలు చరమగీతం పాడారని ఆయన వ్యాఖ్యానించారు.

తన పాలన ప్రజలందరి కోసం ఉంటుందని, రాష్ట్ర హక్కులు, లౌకికవాదం విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడబోమని హామీ ఇచ్చారు. "రాజకీయంగా చెబుతున్నా, ఇప్పుడు పోటీ కేవలం రెండు పార్టీల మధ్యే. ఒకటి డీఎంకే, మరొకటి టీవీకే. మధ్యలో ఇంకెవరికీ పాత్ర లేదు" అని ఆయన తేల్చిచెప్పారు. తమ పార్టీపై వస్తున్న హార్స్ ట్రేడింగ్ ఆరోపణలను ఖండించిన విజయ్, అధికారం కోల్పోయిన డీఎంకే, అన్నాడీఎంకేలే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

"ఇన్నేళ్లుగా మిమ్మల్ని మోసం చేస్తున్న వారిని కాదని, మీ కోసం పనిచేయడానికి వచ్చిన మీ విజయ్‌ను, మీ అన్నను, మీ తమ్ముడిని ముఖ్యమంత్రిగా కాదు, మీ మొదటి సేవకుడిగా ఎన్నుకున్నారు" అని అన్నారు. తాను అధికారంలోకి వచ్చి కొద్ది వారాలే అయినా, ఆరు నెలలు మౌనంగా ఉంటామని చెప్పిన వాళ్లు ఆరు రోజులు కూడా ఆగలేకపోయారని విమర్శించారు. చివరగా, తాను సూట్ ధరించడంపై వస్తున్న విమర్శలపై స్పందిస్తూ, సూట్ ఎందుకు వేసుకోకూడదని ప్రశ్నించారు.

## పవన్ కల్యాణ్ సభకు అనుమతి నిరాకరణ... తీవ్రంగా స్పందించిన జనసేన పార్టీ

- మొదటి పేజి తరువాయి

జనసేన పార్టీ తీవ్రంగా స్పందించింది. ప్రభుత్వ చర్య పూర్తిగా అర్థరహితమని, రాజకీయ దురుద్దేశంతోనే తమ కార్యక్రమాన్ని అడ్డుకున్నారని పార్టీ వర్గాలు ఆరోపించాయి.

వివరాల్లోకి వెళితే, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని, 'తెలంగాణ నవ నిర్మాణ సంకల్ప సభ - జనసేన సాధక్ సమ్మేళనం' పేరిట ఓ ఇండోర్ కార్యక్రమం నిర్వహించాలని జనసేన పార్టీ నిర్ణయించింది. సుమారు 2000 మంది పార్టీ క్రియాశీలక కార్యకర్తలతో గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాల్‌లో ఈ సమావేశం తలపెట్టారు. రాష్ట్ర అభివృద్ధిలో జనసేన పాత్ర, భవిష్యత్ కార్యాచరణ, పార్టీ బలోపేతం వంటి అంశాలపై శ్రేణులకు దిశానిర్దేశం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

అయితే, పార్కింగ్ సమస్యను కారణంగా చూపుతూ ప్రభుత్వం ఈ సభకు అనుమతి నిరాకరించింది. ఈ నిర్ణయాన్ని జనసేన తీవ్రంగా తప్పుబట్టింది. నిత్యం ఎన్నో సాంస్కృతిక, రాజకీయ, కార్పొరేట్ సమావేశాలు జరిగే సంధ్య కన్వెన్షన్‌లో, కేవలం తమ కార్యక్రమానికే పార్కింగ్ సమస్యను కారణంగా చూపడం సహేతుకం కాదని పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు.

ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ వ్యాఖ్యల వివాదం ముగిసిపోయిన అధ్యాయమని, ఆయనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకున్నారని జనసేన గుర్తుచేసింది. ఈ అంశంపై ఏపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి చర్యలు ఉండబోవని స్వయంగా పవన్ కల్యాణ్ స్పష్టం చేశారని వెల్లడించింది. అయినప్పటికీ, ఆ వ్యవహారాన్ని సాకుగా చూపి సభను అడ్డుకోవడం సరికాదని పార్టీ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

## వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసింది వైసీపీ కార్యకర్తే

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వైసీపీ దుష్ట రాజకీయాలకు పాల్పడుతోందని ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో అలజడులు సృష్టించి, శాంతిభద్రతలకు భంగం కలిగించేందుకు ఆ పార్టీ నేతలు కుట్రలు పన్నుతున్నారని, కూటమి కార్యకర్తలు వైసీపీ ఉచ్చులో పడకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం ఉమ్మడి కర్నూలు జిల్లా ముదిగేడులో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నంద్యాలలో వైఎస్సార్ విగ్రహంపై దాడి చేసింది వైసీపీ కార్యకర్త జంబులయ్యేనని మంత్రి స్పష్టం చేశారు. తాము వైసీపీ మద్దతుదారులమంటూ అతని భార్య వీడియో విడుదల చేసిందని, స్థానిక వైసీపీ కార్పొరేటర్ శేషయ్యే తమకు ఉద్యోగం ఇప్పించారని ఆమె స్వయంగా అంగీకరించిందని తెలిపారు. వాస్తవాలు ఇలా ఉంటే, ఈ కుట్రలో తెలుగుదేశం పార్టీని ఇరికించేందుకు వైసీపీ ప్రయత్నించిందని ఆయన మండిపడ్డారు. 1995లో చంద్రబాబు సీఎం అయినప్పటి నుంచే ఫ్యాక్షనిజంపై ఉక్కుపాదం మోపారని ఆయన గుర్తుచేశారు. గత ఎన్నికల్లో 151 సీట్ల నుంచి కేవలం 11 సీట్లకు పడిపోయిన ఆ గొడ్డలి పార్టీ నాయకులకు తమ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఎండగట్టారు.

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో ఏపీ మంత్రి నారా లోకేష్ భేటీ

ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముంబైలో పర్యటిస్తున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు.ముంబైలోని వర్షా బంగ్లాలో ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ ఆయనకు సాదరంగా స్వాగతం పలికారు. లోకేష్ ఆయనకు తిరుమల శ్రీవారి ప్రతిమ, మంగళగిరి శాలువా బహూకరించగా, ఫడ్నవీస్ గణేశుడి విగ్రహాన్ని అందజేశారు. ఇరు రాష్ట్రాల మధ్య ద్వైపాక్షిక అంశాలు, ఏపీలో పెట్టుబడులు, వ్యాపార అనుకూల విధానాలు, విద్యా సంస్కరణలపై వారు చర్చించుకున్నారు.లోకేష్ తన ముంబై పర్యటనలో, ఎయిర్‌ట్రంక్ సీఈఓ రాబిన్ ఖుదాతో లోకేష్ సమావేశమై విశాఖపట్నం ప్రాధాన్యతను వివరించారు. వైజాగ్‌ను ఐటీ, ఏఐ హబ్‌గా తీర్చిదిద్దుతున్నామని, ఇప్పటికే గూగుల్, రిలయన్స్ వంటి సంస్థలు ఏఐ డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయని తెలిపారు. విశాఖలో కొత్త క్యాంపస్‌ను ఏర్పాటు చేయాలని ఎయిర్‌ట్రంక్‌ను లోకేష్ ప్రత్యేకంగా కోరారు.

లోకేష్ ప్రజెంటేషన్, ఏపీ ప్రభుత్వ ప్రతిపాదనలపై ఎయిర్‌ట్రంక్ సీఈఓ సానుకూలంగా స్పందించారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటు అవకాశాలను తీవ్రంగా పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏపీ ఐటీ రంగంలోకి పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా లోకేష్ ఈ పర్యటనలు చేపడుతున్నారు.

## పారదర్శకతే లక్ష్యం.. టీజీపీఎస్సీలో కీలక సంస్కరణలు

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీ ఎస్సీ) నిర్వహించే అన్ని నియామక పరీక్షలను ఇకపై కంప్యూటర్ ఆధారిత విధానంలోనే (సీబీటీ) నిర్వహిస్తామని చైర్మన్ బుర్రా వెంకటేశం స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా నియామక ప్రక్రియలో మరింత భద్రత, పారదర్శకత సాధ్యమవుతుందని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ప్రస్తుత పరిస్థితుల్లో నియామక పరీక్షల నిర్వహణకు కంప్యూటర్ ఆధారిత విధానమే అత్యుత్తమ మార్గం. సంప్రదాయ ఓఎంఆర్ విధానంతో పోలిస్తే ఇది ఎంతో సురక్షితమైనది. పరీక్షకు గంట ముందు కూడా ప్రశ్నపత్రాన్ని సిద్ధం చేసే వెసులుబాటు ఉంటుంది" అని వివరించారు. కమిషన్‌లో అనేక సంస్కరణలు ప్రవేశపెడుతున్నామని, అభ్యర్థుల్లో విశ్వాసం నింపేందుకు సాంకేతికతను వాడుకుంటున్నామని తెలిపారు.

అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలివ్వడం సాధ్యం కాదని, అందుకే పోటీ పరీక్షల్లో కొందరికి నిరాశ తప్పదని ఆయన అన్నారు. కమిషన్‌పై వచ్చే నిరాధార విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. పారదర్శకతను పెంచే ఉద్దేశంతో ఇకపై ప్రతి రెండు, మూడు నెలలకు ఒకసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడిస్తామని ప్రకటించారు.

## చెట్టు నుంచి దింపిన తాజా కల్లు రుచి చూసిన చంద్రబాబు...

- మొదటి పేజి తరువాయి

కల్లు తీసే విధానాన్ని ఆసక్తిగా పరిశీలించారు. గీత కార్మికులు అప్పుడే తీసిన తాజా తాటి కల్లును రుచి చూశారు. ఈ పర్యటనకు సంబంధించిన వివరాలను, ఫొటోలను ముఖ్యమంత్రి చంద్రబాబు తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పేద ప్రజల సంక్షేమమే తన ప్రభుత్వ లక్ష్యమని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## జిల్లా కలెక్టరేట్ వద్ద డీఎస్సీ అక్రమాలపై రూరల్ వైసీపీ శ్రేణులు నిరసన




**రాజమహేంద్రవరం , పెన్ పవర్,జూన్ 1 :**కూటమి ప్రభుత్వంలో జరిగిన డీఎస్సీ అక్రమాలను వ్యతిరేకిస్తూ రూరల్ వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. బొమ్మూరు లోని పార్టీ కార్యాలయం నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు మెగా కాదు-దగా డీఎస్సీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను బర్త్ రఫ్ చేయాలని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో వైసిపి నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి , మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు , మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి , రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఏపీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్పర్సన్ మేడపాటి షర్మిళ రెడ్డి , ముద్దల అను పాల్గొన్నారు .అనంతరం జిల్లా కలెక్టర్ ఆఫీసులో వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి వివిధ విభాగాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# ప్రజల అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదు

- పీజీఆర్ఎస్‌లో 111 అర్జీల స్వీకరణ
- అధికారులకు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టమైన ఆదేశాలు



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 1 :**ప్రజల నుంచి అందే అర్జీలను సకాలంలో పరిశీలించి పరిష్కరించడం ప్రతి అధికారికి అత్యంత ముఖ్యమైన బాధ్యత అని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని, ప్రతి అర్జీని నిర్దేశిత ఎస్ఎల్ఏ కాలపరిమితిలోగా పరిశీలించి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సోమవారం రంపచోడవరం ఐటిడిఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతులు, సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి అధికారులకు తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు అయ్యే అర్జీలు సంబంధిత అధికారుల లాగిన్‌లలో అందుబాటులో ఉంటాయని, వాటిని ప్రతిరోజూ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఆయా శాఖల అధికారులదేనని పేర్కొన్నారు. అర్జీలను నిర్లక్ష్యం చేయడం విధుల్లో అలసత్వానికి నిదర్శనమని హెచ్చరించారు.రీ-ఓపెన్ అయిన అర్జీలపై నిర్వహించిన ఆడిట్‌లో కొంత పురోగతి కనిపించినప్పటికీ, ఇంకా కొన్ని అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదని ఆయన తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 6,359 పీజీఆర్ఎస్ అర్జీలను పరిష్కరించగా, వాటిలో 2,484 అర్జీలను ఆడిట్ చేసినట్లు వెల్లడించారు. ఇది మొత్తం పరిష్కరించిన అర్జీలలో 39.06 శాతం అని వివరించారు.పెండింగ్‌లో ఉన్న అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించిన కలెక్టర్, మంగళవారం సాయంత్రం జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో హాజరై, తమ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అర్జీల స్థితిగతులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించాలని సూచించారు.పోలవరం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తిగత, సామూహిక సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించి, సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామని, మిగిలిన సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల ద్వారా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు.ఈ వారపు గ్రీవెన్స్ మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో మొత్తం 111 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ వెల్లడించారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, ఏపీఓ జనరల్ డీఎన్‌వీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఎంహెచ్‌వో పి. సరిత, సీపీఓ వెంకట్రావు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ దాసరి రత్నాకరరావు, ఏజెన్సీ జిల్లా విద్యాశాఖ అధికారి వై. మల్లేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల నీటి తొట్టెలను శుభ్రం చేస్తున్న స్వర్ణ గ్రామ సిబ్బంది




పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**వై రామవరం, పెన్ పవర్, జూన్ 1 :** పశువుల దాహార్తి కోసం ఏర్పాటుచేసిన నీటి తొట్టెలను శుభ్రం చేయించడం జరుగుతుందని ఎంపీడీవో కే బాపన్న దొర తెలిపారు. పెన్ పవర్ దినపత్రికలో వెలువడిన పలు కథనాలపై స్పందించిన ఎంపీడీవో మండలంలో వివిధ గ్రామాలలో ఉన్న పశువుల నీటి తొట్టెలను శుభ్రం చేయించడం జరుగుతుందని తెలిపారు. కే ఎర్రగొండ పంచాయతీ రేగడి పాలెం, పెద్ద ఊలేంపాడు గ్రామాలలో ఉన్న పశువుల నీటి తొట్టెలను శుభ్రం చేయించడం జరిగిందని పెన్ పవర్ కు వివరణ ఇచ్చారు. అదేవిధంగా వివిధ గ్రామాలలో ఉన్న పశువుల నీటి తోటలలో నీటిని నింపడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు.

## జిల్లా పోలీస్ గ్రీవెన్స్ లో 29 ఫిర్యాదులు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 1 :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం కార్యక్రమాన్ని తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి వివిధ రకాల అర్జీలను స్వీకరించి వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకుని సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయవలసినదిగా ఉత్తర్వులు ఇచ్చారు. పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 29 ఫిర్యాదులు రాగా, వీటిలో సివిల్ కేసులు, కుటుంబ సమస్యల గురించి, చీటింగ్ కేసులు, కొట్లాట కేసులు ఇతర కేసులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించారు.

# జిల్లా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ లో 219 అర్జీలు

- జనగణన లో దోషాలు లేకుండా ఖచ్చితత్వంతో నమోదు చేయాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 1 :**జనగణన ప్రక్రియలో దోషాలు లేకుండా పూర్తి ఖచ్చితత్వంతో జనాభా వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. 2011 జనాభా లెక్కలతో పోలిస్తే ప్రస్తుత గణన లో జనాభా పెరుగుదలతో కూడి నమోదు కావాల్సి ఉంది. కొన్ని ప్రాంతాల్లో జనాభా తక్కువగా నమోదైనట్లు గుర్తించిన నేపథ్యంలో అధికారులు మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించాలన్నారు. ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం బేరీజు వేసుకుని, సహేతుకత కలిగి ఉండాలని కోరుతున్నా అని తెలియ చేశారు. ప్రతి ఇంటిని సందర్శించి జనాభా వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఉన్న వసతి సదుపాయాలపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. .

**పి జి ఆర్ ఎస్ వివరాలు...**

ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు తమ ఫిర్యాదులు, వినతులు మరియు సమస్యలను "మీకోసం" పోర్టల్ ద్వారా లేదా 1100 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 219 అర్జీలు అందాయి. ఆన్‌లైన్ ద్వారా 213, ఆఫ్‌లైన్ ద్వారా 6 అర్జీలు స్వీకరించారు. శాఖల వారీగా పరిశీలిస్తే రెవెన్యూ ) శాఖకు అత్యధికంగా 104 అర్జీలు, పంచాయతీరాజ్ శాఖకు 46, హోం శాఖకు 22, మున్సిపల్ పరిపాలన పట్టణాభివృద్ధి శాఖకు 8 అర్జీలు అందాయి. మిగిలిన 39 అర్జీలు వివిధ శాఖలకు సంబంధించినవిగా నమోదయ్యాయి. అందిన అర్జీలను సత్వరమే పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

జూన్ 1న నిర్వహించిన రెవెన్యూ క్లినిక్‌లో 104 అర్జీలు అందగా, రెవెన్యూ క్లినిక్ (పీజీఆర్ఎస్) 90, ఏపీ సేవా సేవల ద్వారా 14 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ క్లినిక్‌లో అత్యధికంగా భూకబ్జాలపై 20 ఫిర్యాదులు అందగా, ఇతర అంశాలకు సంబంధించి 10, రీ-సర్వే (ఎస్ఎస్ఎల్ఆర్)కు సంబంధించినవి 9, రీ-సర్వేలో తలెత్తిన సమస్యలపై 9, రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్)కు సంబంధించినవి 8, సాధారణ సర్వే అంశాలపై 5 అర్జీలు అందాయి. మిగిలిన అంశాలైన రిజిస్ట్రేషన్ సేవలు, 22(ఏ) నుంచి తొలగింపు అభ్యర్థనలు, ఆక్రమణలు, అసైన్‌మెంట్లు, ఆఫ్‌లైన్ పిటిషన్లు, లంక భూముల సమస్యలు, జీఎస్‌డబ్ల్యూఎస్/మీసేవా ఫిర్యాదులు, భూసేకరణ సమస్యలు, ప్రసాదం, సరిహద్దు నిర్ధారణ, వాల్టా చట్టం, రెవెన్యూ అధికారులపై ఫిర్యాదులు, పట్టా సబ్‌డివిజన్ కు సంబంధించి 29 అర్జీలు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ రెవెన్యూ క్లినిక్ లో అర్జీలు స్వీకరించడం జరిగింది. కలెక్టరేట్ లో ఇన్‌చార్జి డీఆర్‌వో ఎస్. భాస్కర్ రెడ్డి, సీపీఓ ఎల్. అప్పలకొండ, ఇతర శాఖల అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
'ఐదు రోజులకు'
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# రాళ్లకుంట గ్రామంలో సమస్యల దరువు..!!



- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు
- నీటి సరఫరా వాల్వుల్లో అపరిశుభ్రత





**ఏలూరు జూన్ 1 పెన్‌పవర్ :** స్వర్ణపంచాయితీ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి వడివడిగా అడుగులేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామ సమస్యలు పరిష్కారానికి,మౌలిక సదుపాయాల పర్యవేక్షణకు నియమించిన ప్రత్యేక అధికారులు వారు గ్రామాలలో పర్యటించక పోవడం,పంచాయితీ సిబ్బంది పనితీరును పర్యవేక్షించే డిప్యూటీ ఎంపిడివోలు కార్యాలయం గడప దాటడం లేదని ప్రజల నుండి విమర్శలు వ్యక్తమౌతున్నాయి.దీంతో గ్రామాల్లో క్షీణించి,ప్రజలు సమస్యలతో సతమత మౌతున్నారు.ద్వారకాతిరుమల మండలం రాళ్లకుంట పంచాయితీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గ్రామంలో ప్రజలు పలు సమస్యలతో సతమతమౌతున్నారు. పంచాయితీ పరిధిలోని పలు కాలనీలలో నీటి సరఫరా చేసే పైపులు పగిలి నీరు వృధాగా పోతున్న పంచాయితీ సిబ్బంది పట్టించుకోవడంలేదని, పంచాయితీ పరిధిలోని సత్తేనగూడెం కాలనీలో రోడ్ పై మురుగు ప్రవహిస్తోందని,బిసి కాలనీలో నీటి సరఫరా పైపులు లీకై తాగు నీరు వృధాగా పోతోందని పంచాయితీ సిబ్బంది విధుల్లో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని,కాలనీల ప్రజల నుండి వమర్శలు వ్యక్తమౌతున్నాయి.గ్రామంలోని ప్రజలతో పాటు,పంచాయితీ పరిధిలోని ఓసి కాలనీ,బి.సి కాలనీ,సత్తేనగూడెం కాలనీలకు తాగునీటి సరఫరా చేసే ఓహెచ్ ఆర్ ట్యాంకు, బిసి కాలనీ లోని ఆరోగ్యకేంద్రం వద్ద పైపులు పగిలి తాగునీరు వృధాగా పోతోంది.వాల్వులు అపరిశుభ్రంగా ఉండడమే కాకుండా,ఓహెచ్ ఆర్ వద్ద వేసవిలో పశువులకు తాగు నీరు అందించేందుకు నిర్మించిన తొట్టి నాసిరకంగా నిర్మించడంతో తొట్టి బీటలు వారి నీరు నిలువడం లేదు.దీంతో పశువులు నీటి తొట్టె వద్దకు వచ్చి ఖాళీ తొట్టెను చూసి వెనుదిరుగుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.సమస్యల పై పంచాయితీ కార్యదర్శిని సంప్రదించడానికి ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు

# పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి






సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 1 :** ప్రతి వారం పీజీఆర్ఎస్‌కు వచ్చే సమస్యల దరఖాస్తులను సకాలంలో పరిష్కరించే బాధ్యత సంబంధిత శాఖల అధికారులపై ఉందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, పరిష్కార ప్రక్రియను సమీక్షిస్తున్నామని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా అందే దరఖాస్తుల విషయంలో సంబంధిత దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి సమస్యపై పూర్తి అవగాహన పొందాలని అధికారులకు సూచించారు. నిబంధనల ప్రకారం ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా పరిష్కరించే బాధ్యత శాఖాధిపతులపై ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు నిజంగా లబ్ధిదారులకు చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ షేక్ షరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రశేఖర్, డీడీఓ నారాయణరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రామమోహన్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దేవదానం, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి, జిల్లా ఉపాధి అధికారి అనుపమ, ఐసీడీఎస్ పీడీ కె. ఉమా, ఎల్‌డీఎం మేనేజర్ గొర్లె బుజ్జిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి. సరిత, సబ్ డీఎఫ్‌వో అనుష, ఏపీవోలు డీఎన్‌వీ రమణ, రామతులసి, పీజీఆర్ఎస్ నోడల్ అధికారి శ్రీనివాస్ విశ్వనాథ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ

**గంగవరం, పెన్ పవర్, జూన్ 1 :** పేదల సంక్షేమం, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల ఆర్థిక భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ అన్నారు. సోమవారం మండలంలోని గంగవరం, ఆమదాలబంధ పంచాయతీల పరిధిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గంగవరం పంచాయతీ పరిధిలోని పాత గంగవరం, కొత్త గంగవరం గ్రామాలతో పాటు ఆమదాలబంధ పంచాయతీ రాజంపాలెం గ్రామంలో మాజీ ఎంపీపీ డాక్టర్ తీగల ప్రభ ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు లబ్ధిదారులకు ప్రతి నెలా సకాలంలో అందించడం ద్వారా వారి జీవనోపాధికి ప్రభుత్వం చేయూతనందిస్తోందన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ రామ్మోహన్ రావు, ఎంపీడీవో వై. లక్ష్మణరావు, తాసిల్దార్ శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి బుల్లియమ్మ, మాజీ సర్పంచ్ కలుముల అక్కమ్మ ,సచివాలయ సిబ్బంది, మహిళా పోలీసు సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, రాజేంద్రప్రసాద్, సత్యవేణి పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మొక్కజొన్న చేను దగ్ధం



**జీలుగుమిల్లి, పెన్ పవర్, జూన్ 1;** జీలుగుమిల్లి పంచాయతీ పరిధిలో సిరివారిగూడెం గ్రామంలో మొక్కజొన్న చేను అగ్నికి ఆహుతి అయింది. కౌలు రైతు గొల్లపల్లి రవి 2 ఎకరాల మొక్కజొన్న చేను వ్యవసాయం చేసేవాడు. సోమవారం కూలీలను తీసుకుని మొక్కజొన్న కండెలను తీయడానికి వెళ్ళగా చేను కాలిపోయి కనిపించడంతో తీవ్ర నిరాశ నికి గురయ్యాడు. చేనుతోపాటు డ్రిప్పు పైపులు కాలిపోవడంతో సుమారు మూడు లక్షల రూపాయలు నష్టం వాటిల్లినట్టు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు చే ఇలా జరిగిందని వాపోయాడు. ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందేలా చూడాలని వేడుకున్నాడు.

# రేషన్ షాపు ను పరిశీలించిన సివిల్ సప్లై డిటి



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,జూన్ 1 ;** తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే నిత్యవసర సరుకులు సక్రమంగా అందజేయాలని మండల సివిల్ సప్లై డిప్యూటీ తహసిల్దారు ఎస్ వెంకటరమణ డీలర్లకు సూచించారు. సోమవారం జీలుగుమిల్లిలో రేషన్ షాపు నంబర్ 17 పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపులు అందుబాటులో ఉంటాయని అన్నారు. షాపులోనే సరుకులను, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమెతో పాటు వీఆర్ఏ షరీఫ్, డీలర్ టి సంధ్యారాణి పాల్గొన్నారు.

# దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు ఉచితంగా పంపిణీ



**కొవ్వూరు, పెన్ పవర్, జూన్ 1:** కొవ్వూరు పట్టణం లోని లిటరరీ క్లబ్ లో 30 మంది దివ్యాంగులకు 2 లక్షల విలువైన జైపూర్ లెగ్స్, కాలిపర్స్ చిడిపి దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిచుట జరిగినది అని ట్రస్ట్ ఛైర్మన్ ప్రత్తిపాటి నాగరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో దివ్యాంగులు ఎవరైనా ట్రస్ట్ వారిని సంప్రదిస్తే కృత్రిమ అవయవాలు, ట్రై సైకిల్స్, ఉపకారణాలు అందిస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన సూరపనేని చిన్ని మాట్లాడుతూ ట్రస్ట్ కు పార్టీ తరుపున, ప్రభుత్వం తరుపున సహాయ సహకారములు అందిస్తాం అని అన్నారు. ట్రస్ట్ గౌరవ డైరెక్టర్స్ జోడాల వెంకట్, అంకం బాబు, ప్రవీణ్ లు మాట్లాడుతూ ట్రస్ట్ కు ఎల్లప్పుడూ మా సహాయ సహకారాలు ఉంటాయి అని, ఆర్దిక పరమైన సహకారం అందిస్తూనే ఉంటాం అని అన్నారు. కొవ్వూరులో సహాయ సహకారములు అందిస్తున్న వైకే శ్రీనివాస్, విల్సన్ రాజ్ లకు ట్రస్ట్ సభ్యులు ధన్యవాదములు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి 4 జిల్లాల నుండి దివ్యాంగులు, ట్రస్ట్ దాత జోడాల రామాదేవి, ట్రస్ట్ సభ్యులు అనపర్తి రాజు, తొర్లపాటి రాజీవ్, కాట్రూ ప్రశాంత్ కుమార్, సాధానాల కిషోర్, నేరేడుమిల్లి ప్రకాష్, నేరేడుమిల్లి ప్రభాస్, కవల రోహిత్, అనిల్, శాత్విక్ లు పాల్గొన్నారు. దివ్యాంగులు మాట్లాడుతూ వారి జీవితాలలో వెలుగులు, నవ్వులు చిందించేట్లు చేస్తున్న దేవోక్తి చారిటబుల్ ట్రస్ట్ వారికి రుణపడి ఉంటాం అని అన్నారు.

# అడ్డతీగలలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ: 91 శాతం పూర్తి. ఎంపీడీవో కుమార్..



**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 01:** అడ్డతీగల మండల కేంద్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం 91% దాదాపుగా పూర్తయినట్లు అడ్డతీగల ఎంపీడీవో కుమార్ తెలిపారు. స్థానిక అడ్డతీగల గ్రామంలో ఎంపీడీవో ఏ.వి.వి కుమార్ స్వయంగా పాల్గొని, లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా మొత్తం 5,176 పింఛన్లకు గాను, ఇప్పటివరకు 4,731 మందికి పంపిణీ పూర్తి చేసినట్లు వెల్లడించారు. అంటే మొత్తం మీద 91శాతం పంపిణీ ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని ఆయన పేర్కొన్నారు. మిగిలిన వారికి కూడా త్వరితగతిన పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

# దివ్యాంగుల సంక్షేమానికి అందరూ చేయూతనందించాలి

* చక్రధర్‌రావుకు రూ.5 వేల ఆర్థిక సాయం, మందుల కిట్ అందజేసిన కలెక్టర్



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 1 :** దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు తోడుగా స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ పిలుపునిచ్చారు.

సోమవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన పూర్తిగా దివ్యాంగుడైన చెరుకూరి చక్రధర్‌రావుకు మానవతా దృక్పథంతో రూ.5 వేల ఆర్థిక సహాయం చెక్కును జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ అందజేశారు. అలాగే ఆయనకు అవసరమైన మందుల కిట్‌ను కూడా అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దివ్యాంగులకు ప్రభుత్వం ప్రతి నెలా వారి ఇంటి వద్దకే పింఛన్లు అందజేస్తోందని తెలిపారు. చక్రధర్‌రావు పూర్తిగా దివ్యాంగుడు కావడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి బలహీనంగా ఉండటం, వైద్య ఖర్చులు అధికంగా ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అందించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, ఎల్డీఎం మేనేజర్ గొర్లె బుజ్జిబాబు, డీఎంహెచ్‌వో డాక్టర్ పి. సరిత, డీసీహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

# సున్నంపాడులో సామాజిక పింఛన్ల పంపిణీ

* లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లు అందజేసిన జాయింట్ కలెక్టర్



**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, జూన్ 1 :** ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్ తెలిపారు. సోమవారం మారేడుమిల్లి మండలం సున్నంపాడు గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని వివిధ రకాల పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం గ్రామంలోని పింఛన్ లబ్ధిదారుల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి వారి చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెల ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేసేందుకు అవసరమైన సిబ్బంది, ఏర్పాట్లు ముందుగానే చేపడుతున్నామని చెప్పారు. లబ్ధిదారులకు పింఛన్లు, రేషన్ బియ్యం సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయాలను ఆరా తీశారు. బడి ఈడు పిల్లలు, పాఠశాలలకు దూరంగా ఉన్న పిల్లలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదు సంవత్సరాలు దాటిన బాలబాలికలను సమీప పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో మడకం కుమారి, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మలేరియా నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

* డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సరిత



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 1 :** మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం కీలకమని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ పి. సరితా పేర్కొన్నారు. మలేరియా నిర్మూలన మాసోత్సవాల సందర్భంగా సోమవారం పోలవరం జిల్లా మలేరియా కార్యాలయం నుంచి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న మలేరియా నిర్మూలన మాసోత్సవాలకు శ్రీకారం చుడుతూ డాక్టర్ పి. సరితా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం డీఎంహెచ్ఓ కార్యాలయం నుంచి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆరోగ్య సిబ్బందితో కలిసి మలేరియా నిర్మూలనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ పి. సరితా, జిల్లా మలేరియా అధికారి కె. భాస్కరరావు మాట్లాడుతూ, “మలేరియా అంతం మన చేతుల్లోనే ఉంది.. ఇప్పుడు సాధించగలం, తప్పక సాధించగలం” అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. మలేరియా నివారణ కోసం ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని, ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి సమయంలో శరీరాన్ని పూర్తిగా కప్పే దుస్తులు ధరించాలని, దోమలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏసీఎం 5 శాతం పిచికారీ చేయించుకోవాలని తెలిపారు. “ప్రతి శుక్రవారం -- ఫ్రైడే డ్రైడే” నినాదంతో ఇంటి పరిసరాలను శుభ్రపరచుకోవడం, నీటి నిల్వల పాత్రలకు మూతలు ఉంచడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్సల్టెంట్ చంటిబాబు, సబ్ యూనిట్ అధికారులు, ఎంఎటీఎస్‌లు, ఎంపీహెచ్‌ఏలు, ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు

## ద్వారకాతిరుమల మండలంలో 95శాతం ఇళ్ల గణన పూర్తి

**తహాశీల్దార్ జె.వి.సుబ్బారావు వెల్లడి**



ఏలూరు జూన్ 1 పెన్‌పవర్ : ఏలూరు జిల్లా ద్వారకా తిరుమల మండలంలో 95శాతం ఇళ్ల గణన పూర్తయినట్లు ద్వారకా తిరుమల తహాశీల్దార్ జె.వి సుబ్బారావు తెలిపారు .మండలంలో 75 వేల 999 మంది జనాభా ఉన్నారని, 19 వేల 978 కుటుంబాల ఉన్నాయన్నారు.ఇప్పటి వరకు 19వేల 649 కుటుంబాల గణన పూర్తయిందన్నారు.మండలంలో 122 బ్లాకులు ఏర్పాటు చేశామన్నారు.110 మంది ఎన్యూమరేటర్లు ద్వారా గణనలో నిర్వహిస్తున్నారన్నారు.గణనలో మొత్తం 33 అంశాలను ఎన్యూమరేటర్లు సేకరిస్తున్నారు.ఇంటి ఇంటియజమానిపేరు విద్యుత్ సౌకర్యం ఉందా,మరుగుదొడ్డి వ్యర్దాలు సెప్టిక్ ట్యాంక్‌లోని వెళుతున్నాయా ఇంటి స్వభావం, సొంతిల్లా,అద్దెకుంటున్నారా? ఎంత మంది నివసిస్తున్నారు,ఇంటి యజమాని పేరు,విద్యుత్ సౌకర్యం ఉందా,మరుగుదోడ్డి వ్యర్దాలు సెప్టిక్ ట్యాంక్‌లో కలుస్తున్నాయా?తాగునీటి కుళాయి ఉందా?వంటగ్యాస్ ,కేబుల్,ఇంటర్‌నెట్ ,ల్యాప్ టాప్,మొబైల్ ఉన్నాయా,ద్విచక్రవాహనం,కారు,జీపు,వ్యాన్ కలిగి ఉన్నారా?తదితర వివరాలు నమోదు చేస్తున్నారన్నారు.ఎండల నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 11 నుంచి 4 గంటల వరకు మద్య నమెదుకు విరామం విరామం ఉంటుందన్నారు. గణకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చిందని,వీరు వస్తేనే వివరాలు తెలియజేయాలని ఆయన సూచించారు.ఎన్యుమరేటర్ నిజమైనవారా? కాదా అనేది యజమానులు ముందుగా తెలుసుకోవచ్చు.సిబ్బంది వివరాలు నమోదు చేసిన తరువాత మోబైల్‌కు ఓటిపి వస్తుంది. నిర్ణీత సమయంలోగా ఇళ్ల గణన పూర్తి చేస్తామని తహాశీల్దార్ తెలిపారు.

## రక్షాభారత్ సేవా సంస్థ అధ్యర్యశీ లో నడవలేని పరిస్థితి లో ఉన్న వ్యక్తి కి త్రీవీలర్ అందజేత.




**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 01:** మానవత్వం చాటుకుంటూ రక్షాభారత్ సామాజిక సేవా సంస్థ మరో మంచి పనికి శ్రీకారం చుట్టింది. సంస్థ అధ్యక్షుడు అల్లాడి బాలాజీ స్వయంగా ముందుకొచ్చి ఆరోగ్య సమస్యల కారణంగా నడవలేని పరిస్థితి లో ఉన్న దాసరి శ్రీనివాస్‌కు త్రీవీలర్ వాహనాన్ని అందజేశారు. రోజువారీ పనులకు తీవ్ర ఇబ్బంది పడుతున్న దాసరి శ్రీనివాస్ పరిస్థితిని తెలుసుకున్న రాక్షభారత్ సామాజిక సేవా సంస్థ వెంటనే స్వదించించి త్రీవీలర్‌ను అతనికి అందజేసి, ఇకపై స్వతంత్రంగా తిరగవచ్చని అభినందించారు.

ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇలాంటి సహాయం వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుందని డాక్టర్ వెంకట్ అన్నారు. రాక్షభారత్ చేసిన సేవను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో రక్షాభారత్ సభ్యులు, స్థానికులు పాగోన్నారు. అవసరంలో ఉన్నవారికి తమ సంస్థ ఎప్పుడూ అండగా ఉంటుందని అల్లాడి బాలాజీ తెలిపారు.

## నగరానికి రానున్న మరో హోల్ సేల్ మహాలక్ష్మి మార్కెట్

**మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**పెన్ పవర్. జూన్ 01:**నగరంలో మరో హోల్ సేల్ మార్కెట్ మహాలక్ష్మి మార్కెట్ త్వరలో అందుబాటులోకి వస్తుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. సోమవారం మోరంపూడి జంక్షన్ వద్ద మహాలక్ష్మి మార్కెట్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే గోరంట్ల పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో శర వేగంగా మార్కెట్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని, సుమారు 400 షాపులతో అన్ని రకాల వ్యాపార సంస్థలతో అతి పెద్ద మార్కెట్ గా అవతరించ బోతుందని తెలిపారు. పార్కింగ్, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సదుపాయాలతో విశాల మార్కెట్ గా అవుతుందని, సిటీ నలుమూలల నుండి వ్యాపారాలు ఇక్కడికి వస్తాయన్నారు. వినియో గదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహాలక్ష్మి మార్కెట్ అధ్యక్షులు నిమ్మలపూడి గోవిందు, కార్యదర్శి గొల్లపూడి కామేశ్వరరావు,

కోశాధికారి భవర్లాల్,

సలహాదారులు కూర్మదాసు ప్రభాకర్, కోటా సుబ్రహ్మణ్యం, వల్లేపల్లి బాబు ఖాన్ చౌదరి, చల్లా శివ, నాగేంద్ర, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్‌లో వచ్చిన ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం చూపాలి






**పీజీఆర్ఎస్‌లో 156, రెవెన్యూ క్లినిక్‌లో 38 దరఖాస్తుల స్వీకరణ**

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**పెన్ పవర్ భీమవరం: జూన్ 1:**జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) మరియు రెవెన్యూ క్లినిక్‌లో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు.

జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి. శివన్నారాయణ రెడ్డి, స్వర్ణ గ్రామ--స్వర్ణ వార్డు అధికారి ఎ. వెంకటలక్ష్మి, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్. వెంకటేశ్వరరావు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించారు. సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రతి అర్జీని ప్రత్యేక శ్రద్ధతో పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి, వారు సంతృప్తి చెందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

ఈ రోజు నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 156 దరఖాస్తులు, రెవెన్యూ క్లినిక్‌లో 38 దరఖాస్తులు స్వీకరించారు.

ప్రధానంగా వచ్చిన ఫిర్యాదులు

ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామానికి చెందిన జి. లక్ష్మీ మానస తన 3 ఎకరాల భూమిలో 28 సెంట్లు ఆన్‌లైన్ రికార్డుల్లో నమోదు కాలేదని, రీ-సర్వే నిర్వహించి సవరణ చేయాలని కోరారు.

వీరవాసరం మండలం అండలూరు గ్రామానికి చెందిన కుసుమలక్ష్మి 2024లో ప్రభుత్వం మంజూరు చేసిన 72 గజాల ఇంటి స్థలాన్ని ఇప్పటివరకు చూపించలేదని, సరిహద్దులు గుర్తించి స్థలం అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

వీరవాసరం మండలం కొణితివాడ బుధరాయుడు చెరువు ప్రాంతానికి చెందిన బాల ఏడుకొండలు మరియు గ్రామస్తులు హై వోల్టేజ్ సమస్య కారణంగా సుమారు రూ.20 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని, మంజూరైన అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు.

పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామానికి చెందిన బిక్కిన సాంబశివరావు కంటి చూపు తగ్గిపోవడంతో ఉపాధి కోల్పోయానని, వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని అర్జీ సమర్పించారు.

పెనుగొండ గ్రామానికి చెందిన తమనంపూడి వెంకట రామకృష్ణారెడ్డి తన 10 సెంట్ల భూమిలో ఆన్‌లైన్ రికార్డుల్లో 9 సెంట్లు మాత్రమే నమోదయ్యాయని, రీ-సర్వే చేసి సవరణ చేయాలని కోరారు.

తణుకు మున్సిపాలిటీ 7వ వార్డు నివాసితులు తమ ప్రాంతంలో రోడ్లు, తాగునీటి సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రం సమర్పించారు.

ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఎస్ సి హోదా కాపాడాలని దళిత క్రైస్తవుల శాంతి ర్యాలీ




**రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేసేలా పార్లమెంట్లో చట్టం చేయాలి**

**ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూన్ 1**

భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛను దళితులకు కల్పించాలని, 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేయాలని తూర్పుగోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, నగరంలోని పలు పాస్టర్ల ఫెలోషిప్పుల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలో దళిత క్రైస్తవులు, పాస్టర్లు శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక దేవి చౌక్ సెంటర్ నుంచి ర్యాలీగా గోకవరం బస్టాండు అంబేద్కర్ విగ్రహం వరకు చేరి ఆందోళనకారులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్కు వినతి పత్రం అందజేశారు. ఈ ర్యాలీలో రాష్ట్రపతి ఉత్తరంలో రద్దు చేయాలని, దళితులకు మత స్వేచ్ఛ కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించాలని ఆందోళనకా రులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జోహాని హాలోనిన్ మాట్లాడుతూ, దేశంలో కొన్ని మతతశక్తులు దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాడడానికి కుట్రలు చేయడాన్నీ ఖండిస్తున్నామన్నారు. 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు సమానత్వ హక్కును హరించే విధంగా దళితుల పట్ల వివక్షత చూపిందన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వును ఆధారంగా చేసుకుని కేంద్ర ప్రభుత్వం తెర వెనక ఉండి సుప్రీంకోర్టుతో దళిత క్రైస్తవులకు వ్యతిరేకంగా

తెచ్చిందన్నారు. వాస్తవానికి దళిత సిక్కులకు, దళిత బౌద్ధులకు లేని దళితులు మతం మారితే దళిత క్రైస్తవులకు కులం రద్దు చేయడం దళితులపై వివక్షత కొనసాగుతూనే ఉందన్నారు. దళిత క్రైస్తవుల రాజ్యాంగ హక్కులను కాపాడుకునేంతవరకు, దళితులకు మత స్వేచ్ఛ కల్పించేంతవరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఏ ఐ సి ఎఫ్ ప్రధాన కార్యదర్శి డానియల్ పాల్ మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా లేని దళితుల మతస్వేచ్ఛ ఈనాడు వివాదంలో పడడం వెనుక సమాజంలో దళితులపై వివక్షత కొనసాగుతుం దనేందుకు నిదర్శనం అన్నారు. దళితుల ఓట్లు వేసుకున్న ప్రజాప్రతినిధులు సైతం కష్టకాలంలో ఉన్న దళిత క్రైస్తవుల సమస్యల పట్ల సానుభూతి లేదని కనీసం ఖండించకపోవడం దారుణమన్నారు. రాష్ట్రపతి ఉత్తర్వులను రద్దు చేసేలా పార్లమెంట్లో చట్టం చేయాలని

డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోతూర్పు గోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, సాటిలైట్ సిటీ పాస్టర్స్ న్యూ ఫెలోషిప్, న్యూ జెర్సీలోమ్ ఫెలోషిప్ చెందిన జాన్సన్, స్టీఫెన్, శ్యాం బాబు, జీ. కృపానందం, జోన్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

## సామాజిక భద్రత పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలి



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్ , జూన్ 1 :**రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా పేర్కొన్నారు. సోమవారం మేదర్ పేటలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ న్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో లబ్ధిదారుల ఆధార్ కార్డులను పరిశీలించి, ఫేస్ రికగ్నిషన్ సిస్టం ద్వారా చెక్ చేసి పింఛన్ డబ్బులు అందించారు. నగరంలో పింఛన్ల పంపిణీ లోఎక్కడైనా లోపాలు ఉన్నట్లయితే వెంటనే తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నగరంలో 27,523 పింఛనుదారులకు ప్రభుత్వం 12 కోట్ల 26 లక్షల 24 వేల 500 రూపాయలు విడుదల చేసిందన్నారు. ఆయన వెంట సెక్రటరీ శైలజవల్లి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## ఉమ్మడి జిల్లా లీగ్ కం నాకౌట్ టేబుల్ టెన్నిస్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 1 :**తూర్పుగోదావరి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్ వద్ద నున్న రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీలో కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పరిధిలో లీగ్ కం నాకౌట్ టేబుల్ టెన్నిస్ పోటీలను నిర్వహించారు.

ఈ పోటీలకు రెండు జిల్లాలలోని కాకినాడ, పెద్దాపురం, రాజమహేంద్రవరం నుండి అనేకమంది క్రీడాకారులు పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిస్ట్రిక్ట్ సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు మాట్లాడుతూ రాజమండ్రి గౌతమి టేబుల్ టెన్నిస్ అకాడమీ కు గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్రంలోను, జాతీయస్థాయిలో పేరు ప్రఖ్యాతులు ఉన్నాయన్నారు. అనేకమంది క్రీడాకారులు శిక్షణ పొంది రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పోటీలలో తమ ప్రావీణ్యాన్ని ప్రదర్శించారన్నారు. అకాడమీ అధ్యక్షులు జెవివి అప్పారెడ్డి కార్యదర్శి కే సత్యనారాయణ కోచ్ ఈటీవీ సుబ్బారావు ఇతర కార్యవర్గ సభ్యులందరూ సమర్థంగా నిర్వహిస్తూ ఎంతోమంది క్రీడాకారులను తీర్చిదిద్దడానికి నిరంతరం కృషి చేస్తున్నారని అభినందనలు తెలియ జేస్తున్నన్నారు, పోటీలలో విజేతులైన క్రీడాకారులకు బహుమతులు అందజేసి భవిష్యత్తు టోర్నమెంట్లలో విజయం సాధించి అకాడమీతో పాటు నగరానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. పోటీలను మాజీ జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి ఈ. ఎన్. టి. సర్జన్, సౌత్ జోన్ గోల్డ్ మెడలిస్ట్ డాక్టర్ జె.మహాలక్ష్మి (మౌనిక రెడ్డి) పాల్గొని పోటీలను ప్రారంభించడంతోపాటు, పాల్గొన్న క్రీడాకారులకి నాప్కిన్స్, స్వీట్స్ ఇచ్చి ప్రోత్సహించారు. అసోసియే షన్ అధ్యక్ష కార్యదర్శులు జెవివి అప్పారెడ్డి సత్యనారాయణ ( భీము) వర్ధమాన క్రీడాకారులకు మెడల్స్ బహుకరించి ప్రోత్సహించారు. ఈ పోటీలకు సమన్వయకర్తలుగా సూరపురెడ్డి సూర్య ప్రకాష్, ఎ వి ఎస్ సింగరాజు,జి. సి సిరి పావని,తాన్యశ్రీ లు పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి. వేణుగోపాలరావు, ఎన్ ఎస్ ఫల్గున్, పి వి సత్యనారాయణ రావు,కురుమళ్ల ఆంజనేయులు, కర్రీ వీరబాబు, జి. సురేష్ కుమార్, అడబాల శ్రీకాంత్, పి ఈ టి బాపిరాజు, భమిడిపాటి అచ్యుత్, శ్రీమతి గిడుతూరి అనురాధ తదితరులు పాల్గొని పోటీలు విజయవంతం అవ్వడానికి కృషి చేశారు.

## నగరపాలక సంస్థ పీజీఆర్ఎస్ లో 23 అర్జీలు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్ జూన్: 1:**ప్రజల నుంచి అందే అర్జీల పరిష్కారం పట్ల అధికారులు త్వరితగతిన స్పందించాలని కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 23 అర్జీలు రాగా వీటిలో ఇంజనీరింగ్ కి 11, రెవెన్యూకి 4, టౌన్ ప్లానింగ్ కి 5, పబ్లిక్ హెల్త్ కి 2, పెన్షన్ కి సంబంధించి ఒకటి ఉన్నాయి. ఆయా సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా పారిశుధ్యం, డ్రైనేజీ , త్రాగునీటి సరఫరా, వీధి దీపాల వంటి మౌలిక సదుపాయాల ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉండాలన్నారు. అర్జీలను మానిటర్ చేయాలని, గడువు తీరకముందే అర్జీలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ శైలజవల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, మేనేజర్ అబ్దుల్ మలిక్, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# మాటలకు చేతలకు పొంతన లేని పవన్ కళ్యాణ్ వైఖరి

- పవన్ కళ్యాణ్ కు కాపులే లేకుంటే సెలబ్రిటీ హోదా దక్కునా ?
- రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూన్ 1:**పవన్ కళ్యాణ్ రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఏ ఒక్క మాట నిలబెట్టుకోలేదని, ఆయన మాటలకు,చేతలకు పొంతన లేదని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి)వ్యవస్తాపక అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఏద్దేవా చేసారు. రాష్ట్రంలో ఏ నాయకు నికి లేని కుల వివాదాలు పవన్ కళ్యాణ్ చుట్టూముడుతుంటా యన్నారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (అర్పిసి) ప్రధాన కార్యాల యంలో జరిగిన పార్టీ వారాంతపు సమావేశంలో మేడా మాట్లా డుతూ, తన రాజకీయ ప్రస్థానం ప్రారంభం లో కాపుల మద్దతు తనకు వద్దని అనేక సార్లు మాట్లాడరన్నారు. తాను కుల నాయకున్నీ కాదంటూనే ఇటీవల నగరంలో తన పార్టీ సమావేశం లో కాపులను విమర్శించటం పవన్ కళ్యాణ్ కే చెల్లుతుందని ఎద్దేవా చేసారు. 2019 – 2024 ఎన్నికల్లో కాపు కులబావంతో తనకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రాధేయ పడిన సంగతి గుర్తు చేశారు. గతంలో గాజువాక , భీమవరంలో ఆ తరువాత మాజీ ఎమ్మెల్యే వర్మ త్యాగంతో పిఠాపురం ఎన్నికలలో పోటీ చేయటానికి అధిక శాతం కాపుల ఓటింగ్ ఉన్నదనే కారణమన్నారు.

ఓట్ల కోసం కాపులను యాచించ టం, తరువాత తాను కుల నాయకుడిని కాదనడం పవన్ కళ్యాణ్ కు పరిపాటన్నారు. కాపుల ఓట్లు అక్కర లేదంటున్న పవన్ కళ్యాణ్ గాజువాక , భీమవరం, పిఠాపురం లో కాకుండా పులివెందుల, కర్నూలు నియోజకవర్గాల్లో ఎందుకు పోటి చేయలేక పోయారో ప్రజలకు చెప్పాలన్నారు. పవన్ కళ్యాణ్ కు చంద్రబాబు కూటమిలో దక్కిన అవకాశం కాపు కులం వల్ల కాదని నిరూపించుకోగలరా అని ఆయన ప్రశ్నించారు. చివరికి కట్టప్ప పాత్రతో కూటమి ప్రభుత్వంలో రాజకీయ స్థానం సుస్థిర పరచు కున్నారన్నారు. అనాదిగా కాపులు పవన్ కళ్యాణ్ వంటి నేతలను నమ్మి మోసపోతు న్నారన్నారు.

**నిలకడ లేని పవన్ కి కార్పొరేట్ మీడియా ప్రాధాన్యత ...**

నిలకడ లేని పవన్ కళ్యాణ్ కి ప్రాధాన్యత నిస్తు ప్రజల దృష్టి మళ్ళించే విధంగా ఆంధ్ర – తెలంగాణా లో కొన్ని కార్పొరేట్ మీడియా సంస్థలు కిరాయి వార్త కథనాలతో కుల ఉన్మాదాన్ని ప్రోత్సహిస్తు న్నాయని విమర్శించారు. పవన్ కు సొంత ప్రయోజనాల కోసం తప్ప ఏనాడు రాష్ట్ర ప్రయోజనాల కోసం కనీస ఉనికిని కూడా చాటలేదని విమర్శించారు.జనసేన పార్టిలో నిలకడ లేని నేత పవన్ మాత్రమేనని, ఆ పార్టి కి బలం అభిమానులైతే బలహీనత ఆయనేనన్నారు.కుల రహితంగా ఆంధ్రప్రదేశ్ లో ప్రత్యామ్నాయ రాజకీయ మార్పుకు కాపులు ఉమ్మడి కార్యాచరణకు సిద్ధం కావాలని అర్పిసి అధ్యక్షులు మేడా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అర్పిసి సెక్యులర్స్ డి వి రమణమూర్తి , దుడ్డే సురేష్, వర్ధనపు శరత్ కుమార్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , కాకర ప్రసాద్ , , చల్లా అఖిల్ , ఏడిద బాబులు , ఎస్ కే సుల్తాన్, ఎస్ కే జరినా, ఎస్ కే సుభాని, నాగురి అన్నపూర్ణ , మాసా ప్రమీల , తదితరులు పాల్గొన్నారు.


## పుష్కర్ ఘాట్‌లో గోదావరిలో మునిగి ఇద్దరు మృతి



**రాజమహేంద్రవరం పెన్ పవర్, జూన్ 1 :**స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద సోమవారం విషాద ఘటన చోటుచేసుకుంది. గోదావరి నదిలో స్నానానికి దిగిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందారు. మృతుల్లో అనకాపల్లి జిల్లా సైపవరం గ్రామానికి చెందిన ఈపు నూకరాజు (25) , నగరం లోని ఆదెమ్మ దిబ్బ ప్రాంతానికి చెందిన దేవర శ్రీనివాస్ (39)లు మృతిచెందారు. వీరిద్దరూ బావమరిదులుగా తెలిసింది. స్నానానికి దిగిన సమయంలో ప్రమాదవశాత్తు లోతైన ప్రాంతంలోకి వెళ్లడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయినట్లు స్థానికుల సమాచారం. ఘటనను గమనించిన స్థానికుల సమాచారంతో గాలింపు చర్యలు చేపట్టి ఇద్దరి మృతదేహాలను నది నుంచి వెలికి తీశారు.

ఈ ఘటనతో పుష్కర్ ఘాట్ పరిసరాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. నూక రాజుకు ఇటీవలనే పెళ్లయింది. ఒక సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వేటమామిడి జంక్షన్లో పోలీసులు వాహనాల తనిఖీ రూ. 8 వేల జరిమానా విధింపు..



**అడ్డతీగల ,పెన్ పవర్, జూన్01:**అడ్డతీగల మండలం వేటమామిడి గ్రామంలో సోమవారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీలు చేపట్టారు. అడ్డతీగల ఎస్సై బి. వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో వాహనదారుల పత్రాలను, హెల్మెట్ నిబంధనలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఒక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేయడంతో పాటు, సరైన వాహన పత్రాలు లేని వారు మరియు హెల్మెట్ ధరించని వాహనదారులకు కలిపి మొత్తం సుమారు 8,000 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఎస్సై వినోద్ తెలిపారు. రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వలక్ష్యం :ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 01:**పేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 33వ వార్డు ఎఫ్ సి ఐ కాలనీ చిరంజీవి పార్క్ వద్ద పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి చేసిన వాగ్దానం మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారం చేపట్టిన వెంటనే రూ.3000గా ఉన్న పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచి 4 వేలు ఇచ్చే విధంగా నిర్ణయం తీసుకుని, మొదటి సంతకం చేశారని గుర్తు చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం పేదల సంక్షేమమే ప్రధమ కర్తవ్యం గా గుర్తించి పెన్షన్లను పంపిణీ చేస్తుందన్నారు. బటన్ నొక్కి పెన్షన్ ఇవ్వడం కాకుండా స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి పింఛన్లు అంద చేయడంతో పాటు ఆయా ప్రాంతాల్లో ఉన్న స్థానిక సమస్యలను అధ్యయనం చేసే అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఇంటింటికి స్వయంగా వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు.

అధికారులు, కూటమి నాయకులు ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు నిరంతరం ప్రజల సంక్షేమం రాష్ట్ర అభివృద్ధి గురించి అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. గతంలో వైసీపీ దోపిడీ పాలనకు, ప్రజలకు మేలు చేసే కూటమి ప్రభుత్వానికి మధ్యగల వ్యత్యాసాన్ని ప్రజలు అవగాహనచేసుకువాలని కోరారు. మేలుచేసే కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమం లో ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మహేష్ బాబు ఫ్యాన్స్ ప్రెసిడెంట్ సింగం సుబ్బారావు అధ్యర్యశీ లో సూపర్ స్టార్ కృష్ణ 84వ జన్మదినోత్సవం



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 01:**సూపర్ స్టార్ కృష్ణ 84వ జన్మదినోత్సవం సందర్భంగా పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం స్థానిక రంగ మహల్ థియేటర్ వద్ద మహేష్ బాబు ఫ్యాన్స్ ప్రెసిడెంట్ సింగం సుబ్బారావు వైస్ ప్రెసిడెంట్ సింగం త్రిమూర్తులు ఆధ్వర్యంలో. సెక్రెటరీ పల్లి రాజేష్ షేక్ నాగూర్. కృష్ణ గారి జన్మదిన వేడుక ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో. కేక్ కటింగ్ చేసి అనంతరం.సూపర్ స్టార్ కృష్ణ అయినటువంటి చాపల పులుసు చికెన్ క్రరీ తో 300 మందికి. చక్కటి పసందైన విందు ఏర్పాటు చేయడం జరిగింది అనంతరం ప్రెసిడెంట్ సుబ్బారావు మాట్లాడుతూ. కృష్ణ గారి లాంటి గొప్ప హీరోకి అభిమానులు గా ఉండడం. చాలా ఆనందంగా ఉందని ఆయన సంవత్సరానికి 12 సినిమాలు తీసి చలనచిత్ర పరిశ్రమలు ఎంతో మంది ఉపాధి కల్పించే వారిని. అన్నారు. సెక్రటరీ పల్లి రాజేష్ మాట్లాడుతూ. సింగం సుబ్బారావు ఆధ్వర్యంలో చేయడం చాలా ఆనందంగా ఉందని ప్రతి కార్యక్రమానికి సహకరిస్తున్నందుకు వారికి ధన్యవాదాలు తెలియజేశారు . కార్యక్రమంలో షేక్ నాగు ప్రసాద్ మురారి. అప్పారావు కృష్ణ మహేష్ బాబు ఫ్యాన్స్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులసంక్షేమం సామాజిక బాధ్యత:ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 01:**దివ్యాంగుల యోగ క్షేమాలు చూడవలసిన బాధ్యత, సమాజంలో ప్రతిఒక్కరికి ఉందని శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో సోమవారం దివ్యాంగులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు మేరకు పి4కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బొలిశెట్టి ఈ సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి పింఛన్లు మంజూరయ్యేవరకు అర్హులైన వారికి పి 4 కార్యక్రమంలో భాగంగా దాతల సహకారంతో ఈ పింఛన్లు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సంకల్పించారు.గత నెలలో ఎమ్మెల్యే సొంత నిధులతో 45 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతినెలా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చిన మేరకు ఈనెల పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సొంతంగా ఇచ్చిన 45 పింఛన్లకు తోపాటు మరికొందరు దాతలు ముందుకు వచ్చి మరో 17 మందికి పింఛన్లు ఇస్తామని ప్రకటించారు.వచ్చే నెలలో మొత్తం 62మందికి పించన్లు ఇస్తారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవడం మనిషి ధర్మంగా భావించి ఆర్థిక వెసులుబాటు ఉన్న ప్రతి ఒక్కరు పి 4 కార్యక్రమంలో భాగస్తులు కావాలని అన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటే భగవంతుని ఆశీస్సులు ఉంటాయని అన్నారు.పేదల సేవ కోసమే జనసేన పార్టీ ఆవిర్భవించిందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. జనసేన అధ్యక్షులు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. జనసేన పై కులముద్ర వేయటం ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. కులాలను, మతాలను కలిపే సిద్ధాంతమే జనసేన మూల సిద్ధాంతమని తెలియజేశారు.కుల, మతాలకు అతీతంగా యువత దేశాన్ని ప్రేమించాలని, ప్రజలకు సేవ చేయాలని పవన్ పిలుపునిచ్చారని అన్నారు. పి 4లో భాగంగా పింఛన్లు ఇవ్వటానికి ముందుకువచ్చిన, కూటమి నాయకులు,వ్యాపార వేత్తలు, ప్రముఖులు,దాతలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. పెంటపాడు ఎమ్మార్వో సునీల్,స్పెషలాఫీసర్ మల్లికార్జునరావు, ఎక్సేంజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, ,పంచాయతీరాజ్ ఏఈ నరసింహమూర్తి, ఎక్సైజ్ ఎస్సై, దొరబాబు, ఏడి యు శ్రీనివాస్, సిఐ ఆది ప్రసాద్, రూరల్ సీఐ, రవికుమార్, వర్తనపల్లి కాశి, పుల్ల బాబి, పాలూరి ఆకాశపు స్వామి, వెంకటేశ్వరరావు, చాపల రమేష్, గొర్రెల శ్రీధర్, సిద్ధ వీర్రాజు, కట్టు బోయిన కృష్ణ ప్రసాద్,వాడపల్లి సుబ్బరాజు, దువ్వ శ్రీనివాస్, పైబోయిన వైద్యహి, బేతినగిరి, ఎరుబండి సతీష్, పసుమర్తి రామ్ లక్ష్మణ్, బుడ్డి సాయిబాబా, కిలపర్తి వెంకటేశ్వరరావు, కేతిరెడ్డి రాంబాబు, పిల్లా రాంబాబు, శనగన రాంబాబు, మద్దిపాటి ధర్మేంద్ర,, గుంటుపల్లి రాంబాబు, వట్టికూటి అబ్బు, కాకర్ల సుభద్ర, పాలూరి భోపాల్, గుండుమోగుల, సురేష్,సూర్పని శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, బేదపూడి వెంకటరావు, గట్టం నాని, మద్దిపాటి రవితేజ, బండారు వెంకట్రావు,


## వెంకట రమణకు నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తనవంతు సాయంగా 25000 అందజేసిన గొర్రెల శ్రీధర్



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. జూన్ 01:**
తాడేపల్లిగూడెం పట్టణంలో... పాతూరు, 12వ వార్డు కి చెందిన చవ్వాకుల దుర్గా వెంకట రమణ
ఇటీవల స్వర్గస్తులైన కారణంగా
ఈ రోజు వారి ఇంటికి వెళ్లి వారి చిత్ర పటానికి పుష్పాలతో నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి
వారి కుటుంబ సభ్యులకు తనవంతు సాయంగా 25000/రూపాయలు ఆర్థిక సహాయం అందజేసిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, తాడేపల్లిగూడెం పట్టణ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్
గొర్రెల శ్రీధర్ వీరితో పాటుగా తెలుగుదేశం పార్టీ నాయకులు ఎరుబండి సతీష్, దాట్ల జగన్నాథరాజు, శ్రీరాముల నాగేశ్వరరావు , దూసనపూడి కృష్ణ ప్రసాద్, బలుసులమ్మ గుడి కమిటీ సభ్యులు.. శ్రీరంగం అంజి బాబు, నీలం సురేష్ ,చింతన్న , ప్రసాద్ తదితరులు నివాళులర్పించారు.

## క్షయ వ్యాధి అంతానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలి పీహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ తిరన్.



**గోకవరం పెన్ పవర్ జూన్ 01 :-**
–క్షయవ్యాధి ప్రాణాంతక వ్యాధి కాదని మందులతో చికిత్స చేసి నయం చేయవచ్చని జి కొత్తపల్లి పీ హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ తిరన్ అన్నారు. క్షయ వ్యాధి నిర్ములనే ప్రభుత్య ధ్యేయంగా ప్రతి ఒక్కరు ఈ వ్యాధి నియంత్రించడానికి సహకరించాలని కోరారు.గోకవరం మండలం గుమ్మాల్లదొడ్డి గ్రామంలో సోమవారం 100 రోజుల టీబి ముక్త్ భారత్ అభియాన్ జన్ భగీదారి కార్యక్రమం నిర్వహించారు.దీనిలో భాగంగా జి కొత్తపల్లి పీ హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ తిరన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదని మందులతో చికిత్స చేసి నయం చేయవచ్చని అవగాహన కల్పించారు. మండలంలో ఎంపిక కాబడిన హైరిస్క్ గ్రామాలలో మొబైల్ హ్యాండ్ హెల్డ్ ఎక్సరే మెషిన్ తో ఎక్సరే లు తీయడం జరుగుతుందన్నారు. గ్రామంలో వారికి స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి ఎక్సరేలతో పాటు నాట్ టెస్టులు చేస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి.ఎస్ శ్రీనివాస్, ఎస్.టి.ఎల్.ఎస్ అమృత, ఎమ్.ఎల్.హెచ్.పి జానకి, ఏ.ఎన్.ఎమ్ సుధారాణి, ఆశాలు సత్యవేణి, యు.దేవి తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

## దేశంలోనే అధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్...ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.



**గోకవరం పెన్ పవర్ జూన్ 01 :--** దేశం మొత్తం మీద అత్యధికంగా పెన్షన్ ఇస్తున్న రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ మాత్రమేనని జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు.సామాజిక పెన్షన్ల పంపిణీలో భాగంగా గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో ఎమ్మెల్యే నెహ్రూ వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి పెన్షన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాలల్లో ముందుకు తీసుకువెళ్ల గలిగిన సత్తా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకే ఉందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. గోకవరం మండలం తిరుమలాయపాలెం గ్రామంలో ఎమ్మెల్యే నెహ్రూ వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకు ఆయన స్వయంగా వెళ్లి పెన్షన్ నగదును అందజేశారు. ఒకేసారి రూ.4వేలు రూపాయలు పెంచిన ఘనత చంద్రబాబుకి దక్కుతుందని, అదే విధంగా రూ.15 వేలు వరకు చంద్రబాబు నాయుడు పెన్షన్ అందిస్తున్నారని ఇది దేశానికే తలమానికమని నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, ఎంపీడీవో ఎం గోవిందు, మండల టీడీపీ కన్వీనర్ పిల్ల చంటిబాబు, తిరుమలయపాలెం గ్రామ మాజీ సర్పంచ్ పురంశెట్టి శివాజీ,టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి భరత్, భూపతిపాలెం రెసిడెన్షియల్ స్కూల్ తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గళ్ళ రాము, ఉంగరాల గణేష్, కోడూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ధవలేశ్వరం లో ఎన్టీఆర్ భరోసా పించన్లు పంపిణీ లో ఎమ్మెల్యే గోరంట్ల



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 1:**అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. సోమవారం ధవలేశ్వరం గ్రామంలో ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొని పింఛన్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రంలో 24 రకాల పెన్షన్లు 4000 నుండి 15వేల రూపాయలు వరకు అర్హులకు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్స్యేటి ప్రసాద్, ఎం.పీ.డీ.వో సునీల్ ఆర్మ్ స్ట్రాంగ్, పుక్కళ్ల రాజు, ఆళ్ల ఆనందరావు, యడ్ల మహేష్, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు, నాళ్ళ రమేష్, దొడ్డి బాబ్జి, దాసరి సాగర్, దాసరి చిన్న రమణ, కురసాల ప్రసాద్, కింథాడ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నాటు సారా పై పిజిఆర్ఎస్ లో ఫిర్యాదు

**సీతానగరం, పెన్ పవర్, జూన్ 01:**సీతానగరం మండలంలోని నాటు సారా పై ఏరులై పారుతుందని కాటవరం గ్రామానికి చెందిన ఎర్రబల్లి వెంకట జయ దుర్గారావు సోమవారం నాడు మండలంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో నాటు సారా పై పీజీఆర్ఎస్ లో ఫిర్యాదు చేశారు. సీతానగరం నుండి కాటవరం వైపుకు వెళ్తున్న రెండో వీధిలో నాటు సారా విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని. నాటు సారా వలన చాలా కుటుంబాలు చిన్న భిన్నం అవుతున్నాయని. అధికారులకు తెలిసిన చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు నుండి ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నత అధికారులు స్పందించి తక్షణమే నాటు సారాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం చేయూత

- సికిల్ సెల్ బాధితునికి రూ .10 వేల ఫించన్ అందజేత



**ఎటపాక పెన్ పవర్ :** దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత అందిస్తుందని ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు పేర్కొన్నారు. సికిల్ సెల్ ఎనిమియా వ్యాధితో భాధపడుతున్న గౌరిదేవిపేట గ్రామానికి చెందిన దారా సూరిబాబుకు వైద్య సహాయం ఆర్థికంగా పెనుభారంగా మారడంతో కూటమి ప్రభుత్వం దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా ఫించన్ మంజూరు కాగా సోమవారం వ్యాధిగ్రస్తునికి రూ.10 వేలు ఫించన్ ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం ఆర్థికంగా బాసటగా నిలుస్తుందని అన్నారు. పేదల పక్షపాతి , మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని , రాష్ట్రంలో సంక్షేమం , అభివృద్ధి రెండు కళ్ళుగా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది , స్థానికులు , తదితరులు పాల్గొన్నారు.

## సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ విజేతగా నెల్లిపాక టీం “తారక్”



**విజేతలకు ఇరవై వేల నగదు బహుమతి ప్రదానం**

**ఎటపాక, పెన్ పవర్ జూన్ 01:** ఎటపాక మండల పరిధిలోని భీమవరం గ్రామంలో గత ఎనిమిది రోజులుగా నిర్వహించిన సమ్మర్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో మొత్తం 26 జట్లు పాల్గొని పోటీపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో అద్భుత ఆటతీరుతో నెల్లిపాకకు చెందిన “తారక్” జట్టు విజేతగా నిలిచింది.
విజేతగా నిలిచిన నెల్లిపాక టీం తారక్ సభ్యులకు టోర్నమెంట్ నిర్వాహకులు రూ.20 వేల నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువతకు క్రీడలపై ఆసక్తి పెంపొందించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
‘పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ’
‘మరిన్ని వివరాలకు సంప్రదించండి ’
93948 55244
షరతులు వర్తిస్తాయి


## ఎన్టీఆర్ సామాజిక పెన్షన్ సకాలంలో అందించడమే తెలుగు తమ్ముల ధ్యేయం. దిండి రాజు



**గోకవరం పెన్ పవర్ జూన్ 01:--** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇస్తున్న ఎన్టీఆర్ సామాజిక పెన్షన్లు సకాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూడడమే మా తెలుగుతమ్ముళ్ల ధ్యేయం అని కొత్తపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దిండి రాజు అన్నారు.సోమవారం గ్రామం లో ఇంటింటికి వెళ్లి మా నాయకులు శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు పెన్షన్లు పంపిణీ కార్యక్రమం చేపట్టామని. అత్యధికంగా అర్హులైన ప్రతి ఒక్కరికి 15 రకాల పెంక్షన్ లు ఇస్తున్న ఘనత తెలుగుదేశం ప్రభుత్వ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కె దక్కుతుందని, మా నాయకులు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ జగ్గంపేట నియోజకవర్గం ను అభివృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తున్నారని ఇలాంటి నాయకత్వం లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామని కొత్తపల్లి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు దిండిరాజు అన్నారు

## లంకూరు కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఉచిత ప్రత్యేక వైద్య శిబిరం





**సుమారు 200 మందికి వైద్య సేవలు**

**సీతానగరం, పెన్ పవర్, జూన్ 01:**రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల రాజమండ్రి ఆధ్వర్యంలో సోమ వారం తూర్పు గోదావరి జిల్లా సీతానగరం మండలంలోని లంకూరు గ్రామంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో వివరాలను రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామీ పరిజ్ఞేయా నందజీ మహారాజ్ వెల్లడించారు. ఈ వైద్య శిబిరం లో ప్రముఖ వైద్యులు డాశ్రీనివాస్ రాయుడు. డా “సత్యం రమేశ్ బాబు పాల్గొని సుమారు 200 మందికి రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వీరిలో 93 మందికి రక్త నీరుడు పరీక్షలు 3 గురికి థైరాయిడ్ పరీక్షలు నిర్వహించినారు .పరమహంస యోగానంద నేత్రలయ వేమగిరి వారిచే సుమారు 43 మందికి కంటి పరీక్షలు నిర్వహించి వారిలో 10 మందిని శుక్లాం ఆపరేషన్ నిమిత్తం వేమగిరి ఆసుపత్రి కి తీసుకుని తరలించారు. 8 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేయనున్నారు ఈ శిబిరంలో పరమహంస యోగానంద నేత్ర లయ ప్రోగ్రాం మేనేజర్ నక్కా చంటిబాబు సిబ్బంది పాల్గొన్నారు.
కస్తూరిబా గాంధీ ఆశ్రమంలో రోగులకు సహాయకులుకు , మామిడి పండ్లను,పులిహోర పొట్లాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో ఆశ్రమప్రతినిధి కుమారి జి. సుశీల ,యాన్నమని వెంకటనారాయణ రామకృష్ణ మిషన్ కో ఆర్డినేటర్ కానుమో ను శ్రీనివాస్, రామకృష్ణా మిషన్ గిరిజన సంచార వైద్యశాల సిబ్బంది పాల్గోన్నారు.


## దోసకాయలపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ..



**మార్ని రాము ఆధ్వర్యంలో తెదేపా జిల్లా అధ్యక్షులు బొడ్డు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేత..**

**కోరుకొండ, పెన్ పవర్, జూన్ 1:** కోరుకొండ మండలం దోసకాయల పల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మారిన రాము ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిదారునికి తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు రాజానగరం నియోజకవర్గం ఇంచార్జ్ , రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి స్వయంగా లబ్ధిదారుని ఇంటికి వెళ్లి చెక్కున అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కంటే కేశ్వర రావు, మార్ని రాము, ధారా రాంబాబు, దూది కాంతారావు,మార్ని బుజ్జి, తదితరులు పాల్గొన్నారు


## 50వ వార్డులో పెన్షన్లు పంపిణీ చేసిన కాశి నవీన్ కుమార్



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూన్ 1 :** కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పథకం అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా ఆర్థిక భరోసా అందుతోందని తెలుగుదేశం పార్టీ తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కాశి నవీన్ కుమార్ అన్నారు. నగరంలోని 50వ వార్డులో స్థానిక సచివాలయ సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు ఇతర లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. సామాజిక పెన్షన్లు వేలాది కుటుంబాలకు నెలనెలా ఆర్థిక అండగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు చింతపల్లి నాని, సునీత, చిన్ని, నిర్మల్ యాదవ్ పాల్గొన్నారు.

## భర్త మరణించిన ఒక్క నెలలో భార్యకు పెన్షన్

### తెదేపా ప్రభుత్వం లోనే సాధ్యమన్న బాధితులు



**కూనవరం,పెన్ పవర్,జూన్1.** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ మండలంలో వృద్ధులకు,వితంతులకు,వికలాంగులకు పండుగల సచివాలయ సిబ్బంది తెదేపా మండల ప్రెసిడెంట్ యడవల్లి భాస్కరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.భర్త చనిపోయి వితంతులైన మహిళలకు ఒక్క నెలలో స్పౌజ్ పెన్షన్ అందించడంతో మహిళలు ఆనందం వ్యక్తపరిచారు.మండల కేంద్రంలో కొత్తగా శాంక్షన్ అయిన స్పౌజ్ పెన్షన్ సూరం బయమ్మ, కొపెల్లి రమణమ్మ కు స్వయంగా ఇంటి వద్దకు వెళ్లి సచివాలయ సిబ్బంది,మండల తెదేపా పార్టీ మండల అధ్యక్షులు ఎడవల్లి భాస్కరరావు,కూనవరం గ్రామ శాఖ అధ్యక్షులు ఎచ్చు రవి,గ్యాస్ శ్రీను,గడ్డం నవీన్ అందించారు. బాధితులు మాట్లాడుతూ భర్త చనిపోయిన నెలలోనే పెన్షన్ అందించడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని,కొత్తగా పెన్షన్ పొందిన లబ్ధిదారులు ప్రభుత్వానికి రుణపడి ఉంటామని అన్నారు.

# ప్రక్కిలంక శివాలయానికి నిధులు కేటాయించాలి





✷ ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ

**తాళ్లపూడి, పెన్ పవర్, జూన్ 1:**మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో వేంచేసిన అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి దేవాలయానికి ఎంతో విశిష్టత ఉంది. అయితే వచ్చే గోదావరి పుష్కరాలకు దేవాలయ పలు అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు కేటాయించాలని దేవాలయ అర్చకులు విశ్వనాథ శర్మ , ఆలయ కమిటీ సభ్యులు దేవాదాయ కమిషనర్ కు రాతపూర్వకంగా లేఖ రాశారు. ఈ దేవాలయం గోదావరి నదికి అత్యంత సమీపంలోను, జంగారెడ్డిగూడెం టూ ప్రక్కిలంక ఆర్ అండ్ బి రోడ్డుకు ఆనుకొని ఉన్న కారణంగా గోదావరి పుష్కరాల సమయంలో భక్తుల తాకిడి అత్యధికంగా ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు చెప్తున్నారు.
గడిచిన పుష్కరాల్లో దూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు లక్షల్లో ఈ దేవాలయాన్ని దర్శించుకున్నారని, భక్తుల సౌకర్యార్థం 2015వ సంవత్సర పుష్కరాల్లో గ్రామస్తుల సహకారంతో సుమారు ఉదయం 2000 మంది భక్తులకు అల్పాహారం, 8000 మందికి అన్నదాన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. కనుక వచ్చే పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని భక్తుల కొరకు ముఖ్యంగా ఏర్పాటు చేయవలసిన అభివృద్ధి పనులు ముఖ మండపము పున:నిర్మాణం, హోమశాల నిర్మాణం, దేవాలయమునకు రంగులు వేయుట, ఎలక్ట్రికల్ మరమత్తు వర్కులు, నవగ్రహా మండపము రిపేరు వర్క్, వాటర్ ట్యాంక్ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణం, కాలక్షేప మండప నిర్మాణం(భోజన సౌకర్యార్థం), ఎంట్రన్స్ గేటుతో కూడిన ఆర్చ్, బోర్డ్ వంటి పనులు నిర్మాణం చేయడానికి పుష్కర నిధులు మంజూరు చేయాలని దేవాలయ కమిషనర్ ని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## అవ్వ తాతలకు ఉదయాన్నే పెన్షన్ పంపిణీ..

✷ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ..




**కోరుకొండ, పెన్ పవర్, జూన్ 1:** కోరుకొండ మండలంలోని పలు గ్రామాలలో ఉదయాన్నే అవ్వ తాతల ఇంటికి ఎమ్మెల్యే బలరామకృష్ణ వెళ్లి వారికి ఒకటో తారీకు అందవలసిన పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు మీరు వెంట వెళ్లి అర్హులైన వారికి పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, అడ్డాల శ్రీను, దొరబాబు, ముక్కా రాంబాబు, వడ్డీ చిన్న, తెలుగుదేశం పార్టీ నాయకులు మార్ని రాము,మార్ని బుజ్జి, దారా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ ఎక్కడ?..
## పల్లెల్లో సమస్యలు గుట్టలుగా....

✷ గ్రామాల వైపు కన్నెత్తి చూడని అధికారులు
✷ మురుగు, త్రాగునీరు, పారిశుద్ధ్య సమస్యలతో ప్రజల అవస్థలు





**తాళ్ళపూడి, పెన్ పవర్, జూన్ 1:** తాళ్లపూడి మండల వ్యాప్తంగా సర్పంచుల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీల పాలనను కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించి రెండు నెలలు గడుస్తున్నా, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక అధికారికి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు అప్పగించడంతో గ్రామాలపై పర్యవేక్షణ పూర్తిగా తగ్గిపోయిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేక అధికారులు బాధ్యతలు
స్వీకరించిన తొలినాళ్లలో గ్రామాలను సందర్శించి పరిస్థితులను తెలుసుకున్నప్పటికీ, అనంతరం గ్రామాల వైపు రావడంలేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో గ్రామాల్లో మౌలిక వసతుల సమస్యలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి.

లోపించిన పర్యవేక్షణ...

ఏంపీడీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ ఎంపీడీవోలు, ఏఈలు, ఎంఈఓలు, ఏవోలకు ప్రత్యేక అధికారుల బాధ్యతలు అప్పగించారు. అయితే తమ శాఖల పనుల ఒత్తిడితో గ్రామాల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించలేక పోతున్నారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఫలితంగా పంచాయతీల్లో అభివృద్ధి పనులు మందగించడంతో పాటు ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రత్యేక అధికారులు కేవలం పేరుకే ఉన్నారని, గ్రామాల్లో పర్యటించి సమస్యలను ప్రత్యక్షంగా
రోడ్లపైకి పొంగిపొర్లుతున్న మురుగునీరు పరిశీలించే పరిస్థితి లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరుతున్నారు.

## సూరప్పగూడెం చెరువులో అపరిశుభ్రత





-చెరువులో నిండుకున్న నీళ్లు

**ఏలూరు జూన్ 1 పెన్‌పవర్ :** వేసవిలో గ్రామంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి ఉపయోగించే తాగునీటి చెరువులో నాచుతోఅపరిశుభ్రత నెలకొంది.వేసవిలో తాగు నీటి ఇబ్బదులు తలెత్తకుండా నీటితో నింపాల్సిన చెరువులో గ్రామ అవసరాలకు సరిపడా గ్రామ పంచాయితీ అధికారలు నింపకపోవడంతో నీటి ఎద్దడి ఏర్పడి తాగునీటి ఇబ్బందులు ఎదుర్కోవలసి పప్తోందోనని ఉంగుటూరు నియోజక వర్గం భీమడోలు మండలం సూరప్పగూడెం గ్రామస్తులు ఆందోళనకు గురువుతున్నారు.మరో పక్క తాగునీటి సరఫరా చేసే ఓహెచ్ ఆర్ వద్ద నీటిని నింపిన తరువాత ఓహెచ్ ఆర్ పై నుండి నీరు కిందకు జారి అపరిశుభ్రతతో నిండుకున్న సంచాయితీ సిబ్బంది పర్యవేక్షణ లేక పోవడంతో నీరు కలుషితమై కుళాయిల నుండి వచ్చే తాగునీరు మురికిగానూ,మలినాలతో కూడిన నీరు సరఫరా అవుతుందని మహిళలు వాపోతున్నారు.చెరువులో నీరు అడుగంటినా సంచాయితీ సిబ్బంది మాత్రం ఇంకా తాగునీరు నెల రోజుల వరకు సరఫరాకు వినియోగిస్తామని చెబుతున్నారు.పంచాయితీ అధికారులు చర్యలు తీసుకుని చెరువులోని అపరిశుభ్రతను తొలగించి చెరువును శుభ్రం చేసి వాల్వుల్లో అపరిశుభ్రతను తొలగించి,గ్రామ ప్రజలకు శుద్దమైన తాగునీరు అందించాలని గ్రామస్దులు కోరుతున్నారు.

## పురుషోత్తపట్నం దేవాదాయ భూముల సమస్యలపై ప్రత్యేక కమిటీ




**పది రోజుల్లో సమీక్ష సమావేశం నిర్వహిస్తాం**
**చింతూరు సబ్ కలెక్టర్**

**చింతూరు, పెన్ పవర్, జూన్ 1:**ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామ పరిధిలో ఉన్న దేవాదాయ శాఖ భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై చింతూరులో కీలక సమావేశం జరిగింది. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఎండోమెంట్స్ అధికారి (ఈఓ) ప్రాజెక్టు అధికారి చింతూరు సబ్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి భూములకు సంబంధించిన వివిధ అంశాలపై సవివరంగా చర్చించారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖకు చెందిన భూముల్లో కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు వెలసినట్లు, భూముల యాజమాన్యం, పరిరక్షణ నిర్వహణకు సంబంధించిన పలు భూవివాదాలు ఉన్నట్లు ఈఓ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ దేవాదాయ శాఖ ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. భూములకు సంబంధించిన అన్ని సమస్యలను చట్టబద్ధంగా, పారదర్శకంగా శాంతియుత వాతావరణంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకోసం రెవెన్యూ, ఎండోమెంట్స్ తదితర శాఖల అధికారులతో ప్రత్యేక కమిటీని రాబోయే పది రోజుల్లో ఏర్పాటు చేసి సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సమస్యలను సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అలాగే స్థానిక ప్రజలు, సంబంధిత వర్గాలు, దేవాదాయ శాఖ ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పరస్పర సహకారంతో భూములకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు శాంతి భద్రతలను పరిరక్షిస్తూ ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## వారపు సంతలో వాహనాల జోరు



**వై.రామవరం, పెన్ పవర్, జూన్ 1 :** మండల కేంద్రమైన వైరామవరంలో సోమవారం జరిగిన వారపు సంతలో వాహనాల జోరుతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.
అసలే ఇరుకైన రహదారి, ఇరువైపులా సంత దుకాణాలు ద్విచక్ర వాహనం వెళితేనే ఇబ్బందికరమైన పరిస్థితుల్లో ఉంటాయని కొనుగోలుదారులు అంటున్నారు. అటువంటి పరిస్థితులలో ఎదురెదురుగా ట్రాక్టర్, ఆటో ప్రయాణికులతో వస్తుంటే ట్రాఫిక్ స్తంభించిపోయిందని పలువురు తెలిపారు. రెండు వాహనదారులు కొంతసేపు ఘర్షణకు దిగడంతో వాతావరణం వేడెక్కిందని అంటున్నారు. అటుగా అడ్డతీగల సీఐ, పోలీసులు రావడంతో ఘర్షణ వాతావరణం సద్దుమణిగిందని తెలిపారు. ఏది ఏమైనా వారపు సొంత రోజున భారీ వాహనాలు మార్కెట్ లోపలకు అనుమతించకుండా చూడవలసిన బాధ్యత అధికారులపైందని పలువురు కోరుతున్నారు.

## 2020-21 తునికాకు బోనస్ తక్షణమే చెల్లించాలి- సిపిఎం డిమాండ్



**చింతూరు, పెన్ పవర్, జూన్ 1:**ఏడుగురాళ్లపల్లి గ్రామంలో సోమవారం తునికాకు కార్మికులతో సిపిఎం నాయకులు సమావేశమై వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, నాయకులు సీసం సురేష్ మాట్లాడుతూ 2020, 2021 సంవత్సరాలకు సంబంధించిన తునికాకు బోనస్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేసినప్పటికీ ఫారెస్ట్ అధికారుల నిర్లక్ష్యంతో ఇప్పటికీ కార్మికులకు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తునికాకు సేకరణలో కష్టపడి పనిచేసిన కార్మికులకు చెందాల్సిన బోనస్ డబ్బులు అధికారుల ఖాతాల్లోనే మగ్గిపోతున్నాయని, ఇది కార్మికుల పట్ల అన్యాయమని విమర్శించారు. తక్షణమే కల్లాల వారీగా ప్రతి కార్మికుడికి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఈ ఏడాది మార్చి, మే నెలల్లో ప్రారంభం కావాల్సిన తునికాకు సేకరణ పనులు ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో అరకొరగా మాత్రమే సాగాయని పేర్కొన్నారు. చింతూరు డివిజన్ పరిధిలో తునికాకు కార్మికుల పట్ల ప్రభుత్వం, ఫారెస్ట్ శాఖ తీవ్ర నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపించారు. 2012 సంవత్సరం నుండి పెండింగ్‌లో ఉన్న బోనస్ మొత్తాలను కూడా ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే తునికాకు కార్మికులను ఐక్యం చేసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లం సుబ్బమ్మ, మొట్టం రాజయ్య, పోడియం లక్ష్మణ్, సవలం కన్నయ్య, సవలం దేసయ్య, కనితి సమయ, సవలం అప్పారావు, జానకమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రంపచోడవరం అటవీ ప్రాంతాల్లో పులి సంచారం కలకలం





**పెద్దపులిని పట్టుకునేందుకు అటవీ శాఖ ముమ్మర చర్యలు**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచన**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 1 :** రంపచోడవరం మండలంలోని అటవీ ప్రాంత గ్రామాల్లో పెద్దపులి సంచారం స్థానిక ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల పులి పశువులపై దాడులు చేయడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమై పులి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.మంగళవారం తెల్లవారుజామున పోక్స్‌పేట పంచాయతీ పరిధిలోని దేవరాతిగూడెం గ్రామం వద్ద ఉన్న ఏ-వన్ రిసార్ట్స్ సమీపంలో ఓ ఆవుపై పెద్దపులి దాడి చేసి హతమార్చినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు పులి అడుగుజాడలను గుర్తించి దాని కదలికలపై నిఘా పెంచారు.అంతకుముందు సోమవారం రాత్రి గంగవరం గ్రామ శివారులోని జువ్వమ్మ కాలువ సమీపంలో వెంకట్రావుకు చెందిన మేకల వద్దకు వచ్చిన పెద్దపులి ఓ ఆవుపై దాడి చేసి చంపినట్లు సమాచారం. వరుస ఘటనలతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ శాఖ అధికారి శివకుమార్ గంగూల్, సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ జె.వి. సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులు దేవరాతిగూడెం, శుద్ధగుమ్మ తదితర గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పులి సంచరిస్తున్న ప్రాంతాలకు వెళ్లవద్దని, ముఖ్యంగా రాత్రి వేళల్లో అడవి అంచులు, పశువుల మేత ప్రాంతాల్లో సంచరించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. పెద్దపులిని సురక్షితంగా పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగినట్లు అధికారులు తెలిపారు. పులి కదలికలను గుర్తించేందుకు కెమెరా ట్రాప్‌లు ఏర్పాటు చేయడంతో పాటు అటవీ సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారు. అవసరమైతే నిపుణుల సహాయంతో బోన్లు ఏర్పాటు చేసి పులిని బంధించే చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పులి కనిపించినా లేదా దాని జాడలు గుర్తించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని, ప్రజలు స్వయంగా పులిని వెంబడించే ప్రయత్నాలు చేయరాదని అధికారులు హెచ్చరించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండి అటవీ శాఖ సూచనలను పాటించాలని కోరారు.



# అటవీ భూములుడిజిటైజ్ కార్యక్రమం



**ఏలూరు, జూన్, 1 :** అటవీ భూములు మరియు అటవీ-వంటి ప్రాంతాలను గుర్తించి, డిజిటైజ్ చేసి, జియో-రిఫరెన్స్ చేయడం, నోటిఫైడ్ అడవులు తదితర అంశాలపై రాష్ట్ర అటవీశాఖ ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర భూపరిపాలన ప్రధాన కమీషనర్ జి. జయలక్ష్మి రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లు, జిల్లా అటవీ శాఖాధికారులతో సోమవారం రాష్ట్ర సచివాలయం నుండి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్-నోటిఫైడ్ అడవులు, ఆక్రమణల ప్రాంతాలు, క్షీణించిన మరియు చెట్లు లేని భూములు, మరియు ప్రభుత్వ అలాగే ప్రైవేట్ తోటల పెంపకంపై డేటా సేకరణ,ప్రభుత్వ రికార్డులతో సహా ప్రభుత్వ రికార్డులలో అడవులుగా నమోదు చేయబడిన భూములు, గెజిట్ నోటిఫికేషన్లు, బ్లాక్ మ్యాప్‌లు మరియు కె ఎం.ఎల్ లేయర్‌లను ఉపయోగించి అటవీ బ్లాక్‌ల డిజిటైజేషన్ జియో-రిఫరెన్సింగ్‌తో పాటు, క్షేత్రస్థాయి ధృవీకరణ, తదితర అంశాలపై కలెక్టర్లు, డిఎఫ్ఓ లతో సమీక్షించారు.ఏలూరు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, జిల్లా అటవీ శాఖాధికారులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**శక్తి యాప్‌ను ప్రతి మహిళ వినియోగించుకోవాలి**

**గంగవరం ఎస్సై వెంకయ్య**



**గంగవరం, పెన్ పవర్, జూన్ 1 :** మహిళల భద్రతకు ప్రభుత్వం, పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి మహిళ శక్తి యాప్‌ను వినియోగించుకొని అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవలను సద్వినియోగం చేసుకోవాలని గంగవరం ఎస్సై వెంకయ్య సూచించారు.గంగవరం మండలం మోహనపురం గ్రామంలో మహిళా భద్రత, శక్తి యాప్ నమోదు, బాల్య వివాహాల నిరోధం, పోక్సో చట్టం, రహదారి భద్రతా చర్యలు, హెల్మెట్ వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకయ్య మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి వివాహాల వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు దెబ్బతింటుందని అన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.చిన్నారులపై లైంగిక నేరాలను అరికట్టేందుకు పోక్సో చట్టం అమలులో ఉందని, పిల్లల రక్షణ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు మంచి స్పర్శ, చెడు స్పర్శల గురించి అవగాహన కల్పించాలని చెప్పారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు.శక్తి యాప్ ద్వారా మహిళలు అత్యవసర సమయంలో వెంటనే పోలీసు సహాయం పొందవచ్చని, ప్రతి మహిళ తమ మొబైల్ ఫోన్‌లో యాప్‌ను నమోదు చేసుకోవాలని ఎస్సై వెంకయ్య పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గ్రామస్థులు, మహిళలు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు

# ఐఐటీ లో సత్తా చాటిన రైతు బిడ్డ



**గంగవరం, పెన్ పవర్ ,జూన్ 1:**గంగవరం మండలం కుమరంగొంది గ్రామానికి చెందిన కుంజం శ్రీలత ఐఐటీ లో సత్తా చాటింది.ఆల్ ఇండియా ఎస్టీ విభాగం లో 865 ర్యాంక్ కైవసం చేసుకుందని రంపచోడవరం గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్న సోమవారం తెలిపారు. తండ్రి చిన్నాలదొర, తల్లి రాజమ్మ వ్యవసాయం చేస్తున్నారు. తమ బిడ్డ ఐఐటీ సీటు పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రుక్మండయ్య, అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

# కోరుకొండ గ్రామదేవత శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు..!!





**✷ ప్రత్యేకంగా అలంకరించిన రథంపై బారి ఊరేగింపు..!!**

**కోరుకొండ,పెన్ పవర్, జూన్ 1;** కోరుకొండ గ్రామ దేవత శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఈనెల 31 తేదీ నుండి అతి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామస్తులు, భక్తులు ఆధ్వర్యంలో అమ్మవారి గరగలు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శ్రీ అంకాలమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అలంకరించి, బ్యాండ్ మేళాలతో శ్రీ అంకాలమ్మ వారి బ్రహ్మోత్సవం పెద్ద ఎత్తున నిర్వహించారు. అలాగే రెండో తేదీ మంగళవారం గ్రామంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు గ్రామానికి చెందిన ఆడపడుచులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారని ఉత్సవ నిర్వహకులు, యూత్ సభ్యులు తెలియజేశారు. అమ్మవారి ఆలయం వద్దక మంగళవారం జరిగే చివరిరోజు ఉత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# లబ్ధిదారుల ఇంటి వద్దకే సామాజిక పింఛన్ల పంపిణీ

## ఉసిరి జొన్నలు గ్రామంలో పింఛన్లు అందజేసిన జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్





**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 1 :** ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు సకాలంలో అందేలా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సోమవారం రంపచోడవరం మండలంలోని ఉసిరి జొన్నలు గ్రామంలో నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్లు అందించేందుకు సిబ్బందిని నియమించి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పింఛన్లు, రేషన్ బియ్యం సకాలంలో అందుతున్నాయా లేదా అనే విషయాన్ని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు.అలాగే బడికి వెళ్లని పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పించాలని అధికారులకు సూచించారు. ఉసిరి జొన్నలు, దొరమామిడి గ్రామాల పరిధిలోని 150 ఎకరాలకు సాగునీరు అందించే దిబ్బడమెట్ట చెరువు మరమ్మతుల అంశాన్ని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, సంబంధిత అధికారులతో పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామంలో ఉన్న జీడి, మామిడి పిక్కల ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు బుల్లి కొండల దొర, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ షేక్ షరీఫ్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ దాసరి రత్నాకరరావు, తహసీల్దార్ సీహెచ్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.